

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.1	28.5
కావలి	37	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	28
కందుకూరు	36	28



వ్యాహ్యాళి.. ఆరోగ్య విహారి!

- అవిశ్రాంత సేవకులుగా వాకర్స్ సంఘాలు
- ఆరోగ్య భద్రత.. పరిసరాల పరిశుభ్రత

ఒకప్పుడు అందరూ కష్టజీవులు. కాయకష్టం చేసి మితమైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండేవారు. రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘ కాలిక రోగాలంటే అప్పట్లో ఎవరికీ తెలియదు. కాలక్రమేణా చాలా మందిలో శారీరక శ్రమ తగ్గింది. ఒంటినిండా రోగాలే. కంటి నిండా నిద్రపోవడం లేదు. ఆరోగ్యం కోసం వైద్యుల సూచనలతో కసరత్తులు చేస్తున్నారు. నడకే ప్రధానమని గుర్తించి తమ దైనందిన జీవితాన్ని వ్యాహ్యాళితో ప్రారంభిస్తున్నారు. వేకువజామున నడకతో ప్రారంభిస్తున్న ప్రముఖులతోపాటు వైద్యులు, అధ్యాపకులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు ఇలా అనేక రంగాల్లో పనిచేస్తున్న వారంతా వాకర్స్ సంఘాలుగా ఏర్పడ్డారు. తమ ఆరోగ్యంపై శ్రద్ధతోపాటు సామాజిక సేవలోనూ పాలుపంచుకుంటున్నారు. ఆరోగ్య శిబిరాలు, అన్నదానాలు, ఇతర సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి)





ఫ్రెండ్స్ వాకర్స్ మజ్జిగ పంపిణీ

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పలు వాకర్స్ సంఘాలు పోటాపోటీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. వివేకానంద వాకర్స్ అసోసియేషన్, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌తోపాటు స్మైల్ వాకర్స్, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్, మహిళా వాకర్స్ సంఘాలు కూడా ఉన్నాయి. వీరంతా ఎవరికి వారు సభ్యులను జత చేసుకుంటూ నిత్యం నడక, వ్యాయామం, లాఫింగ్, సరదా కబుర్లతోపాటు ఏదో ఒక కార్యక్రమాన్ని చేస్తుంటారు. ఒక్కో సంఘంలో కనీసం 200 మంది సభ్యులు ఉండగా వీరంతా తమతమ సంఘాలకు నాయకులను ఎన్నుకుని వారి ద్వారా వైద్య శిబిరాలు, అన్నదానాలు, క్రీడాకారులకు పౌష్టికాహారాలు పంపిణీ, క్రీడా దుస్తులు అందించడం, ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులకు చేయూత అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతుంటారు. అలాగే అన్ని రకాల ఉచిత వైద్య శిబిరాలు, వైద్య అవగాహన సదస్సులు, ప్రతి వారం క్రమం తప్పకుండా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎవరికివారుగా సొంత నిధులతోనే కార్యక్రమాలు నిర్వహించడం గమనార్హం. అలాగే నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు, జడ్పీ వాకర్స్, వీఆర్సీతోపాటు కావలి, చిట్టగుంట తదితర ప్రాంతాల్లోనూ వాకర్స్ అసోసియేషన్లు ఉన్నాయి. ముఖ్యమైన రోజుల్లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

ఎంతో ఆనందంగా ఉంది



స్టేడియంలో ఆహ్లాదకర వాతావరణంలో వాకింగ్ చేయడం, అసోసియేషన్ ద్వారా అందరూ ఒక్కటిగా కలిసి చర్చించుకోవడం రోజంతా ఉత్సాహన్ని నింపుతోంది. ప్రతిరోజూ ఏదో ఒక కార్యక్రమాన్ని సిద్ధం చేసుకుని అందరూ ఒకే వేదికపై దాన్ని అమలు చేయడం ద్వారా సభ్యులందరిలో కూడా సేవా స్ఫూర్తి కలిగిస్తోంది. ఇదే ఉత్సాహంతో ముఁదు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేస్తాము.

- కిలారి శ్రీనివాసులు నాయుడు, ఫ్రెండ్స్ వాకర్స్ సంఘం అధ్యక్షుడు



అన్నదానం చేస్తున్న వివేకానంద వాకర్స్

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



నడక, వ్యాయామం కోసం వచ్చే వాకర్స్ ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా మా అసోసియేషన్ ద్వారా సేవలందిస్తున్నాము. వాకర్స్‌కు ఆరోగ్య పరీక్షలతోపాటు ఆరోగ్య సదస్సులు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందస్తు సమాచారం అందిస్తున్నాము. అలాగే పేదలకు అన్నదానం, వస్త్రదానంతోపాటు క్రీడాకారులకు పౌష్టికాహారం, పేద క్రీడాకారులకు ఆర్థిక చేయూత అందించి ప్రోత్సహిస్తున్నాము. స్టేడియంలో దుమ్ము, ధూళి లేకుండా ట్యాంకర్స్ ద్వారా నీటిని చల్లిస్తూ ప్రశాంత వాతావరణంలో వాకింగ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాము.

- చింతల అమరేంద్రరెడ్డి, వివేకానంద వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

- ప్రత్యేక రోజుల్లో సమైక్యత

వాకర్స్ సంఘాలు ప్రతిరోజూ ఎవరికి వారు తమ దైనందిన కార్యక్రమాలు నిర్వహిస్తూ పోటీపడుతుంటారు. అయితే ప్రత్యేక రోజుల్లో (పండుగలు, పర్వదినాలు) మాత్రం అన్ని సంఘాలు ఒక్కటవుతాయి. ఆయా సందర్భాన్ని బట్టి జాతీయ సమైక్యతను, పండుగల విశిష్టతలను, సంస్కృతీ, సంప్రదాయాలను తెలియచేస్తూ పండుగ వాతావరణాన్ని సృష్టిస్తారు. అలాగే గుడ్డ సంచులను, ఆరోగ్యానికి కోడిగుడ్లను, వేసవిలో నెలరోజులపాటు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను అందిస్తూ పర్యావరణ పరిరక్షణపై ఎక్కువగా ప్రచారం చేస్తుంటారు. వాకర్స్ సభ్యుల పుట్టినరోజు వేడుకలను నిర్వహిస్తూ అందరికీ కేక్‌లను పంచి పెడుతుంటారు. అంతేగాక ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ పాలు పంచుకోవడంతోపాటు విపత్తుల సమయంలో ఆయా సంఘాలు విరాళాలు కూడా అందిస్తుంటాయి. వయసుతో నిమిత్తం లేకుండా స్వచ్ఛందంగా సేవలందిస్తూ నేటితరం యువతకు వాకర్స్ సంఘాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు కృషి



నేడు పెరిగిన ఆధునిక జీవనంలో ఎన్నో అనారోగ్యసమస్యలు, ఇబ్బందులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. వీటిని తగ్గించేందుకు మావంతుగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాము. ప్లాస్టిక్ వినియోగం ఎంత ప్రమాదకరమో తెలియజేస్తూ గుడ్డ సంచులను పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నాము. అలాగే ఆరోగ్యకర ఆహారాన్ని వాకర్స్‌కు అందించడం, మజ్జిగను పంపిణీ చేస్తున్నాము. శతమానంభవతి పేరుతో సభ్యులందరి పుట్టినరోజు వేడుకలను నిర్వహిస్తూ వారిలో ఉత్సాహన్ని నింపుతున్నాము.

- నలుబోలు బలరామయ్య నాయుడు, వాకర్స్ సంఘాల ఎలెక్ట్ గవర్నర్

Sunday SPECIAL

పవన సుతుడిపై పెంచలోరి వైభోగం!

- ఉదయం హంస వాహనంపై విహారం
- నేడు నృసింహ జయంతి
- భారీగా తరలిరానున్న భక్తజనం



స్వర్ణ హనుమంతుడిపై విహరిస్తున్న పెంచలస్వామి

రాపూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభోవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మూడవరోజు శనివారం ఉదయం పెంచలస్వామి సరస్వతీ అలంకరణలో హంస వాహనంపై విహరించారు. యాగశాలలో నిత్య హోమాలు, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక చందనాలంకారం, అభిషేకాలు కొనసాగుతున్నాయి. సాయంత్రం స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి తిరుచ్చిపై శ్రీవారిని ఉంచి క్షేత్రోత్సవం నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు

- స్వర్ణ హనుమంతుడిపై..

రాత్రి పెంచలస్వామి రామావతారంలో విల్లంబులు చేతబట్టి బంగారు హనుమంతుడిపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. పరిమళ భరిత పూలమాలలు, విశేష ఆభరణాలతో అలంకృతమైన స్వామివారు మాడ వీధుల్లో విహరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కోన వీధుల్లో స్వామివారికి క్షేత్రోత్సవం నిర్వహించారు. కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారి సన్నధిలో శివ నృత్య కళా నిలయానికి చెందిన (నెల్లూరు) చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

- నేడు స్వర్ణగరుడ సేవ

భక్తుల ఇష్టదైవం లక్ష్మీ నృసింహుడు. ఈయనకు ప్రీతి పాత్రమైన వాహనం గరుత్మంతుడు. ఈ దేవదేవుడి జన్మదినం (నృసింహ జయంతి) ఆదివారం. ఎంతో విశిష్ట కలిగిన ఈ పర్వదినాన తమ దైవాన్ని కనులారా వీక్షించేందుకు కోనకు భక్తజనం పోటెత్తనుంది. ఆదివారం రాత్రి 11 గంటలకు స్వర్ణ గరుడుడిపై శ్రీవారు కొలువుదీరి మాడవీధుల్లో విహరించనున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు : డీఎస్‌వో

నెల్లూరు (హరనాథపురం) : ఫలసరుకులు, నూనెల కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డీఎస్‌వో విజయ కుమార్ వ్యాపారులను హెచ్చరించారు. శనివారం తన చాంబర్‌లో వంటనూనెలు, ఫల సరుకుల వ్యాపారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో ఫల సరుకులు, నూనెలు అన్నీ అందుబాటులో ఉన్నాయని వివరించారు. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచి అమ్మాలని చూస్తే ఊరుకోబోమన్నారు. ఫల సరుకులు, నూనెలపై తనిఖీలు ఉంటాయన్నారు. సమావేశం లో ఏఎస్‌వో అంకయ్య, రిలయన్స్, డీమార్ట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుడిపై వేదగిరీశుడు



నెల్లూరురూరల్ (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో శనివారం వేదగిరి లక్ష్మీనరసింహస్వామి హనుమంతుడిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందు గా ఆలయంలో అమ్మవార్లతోపాటు స్వామివారిని అలంకరించిన అర్చకులు చప్పర ఉత్సవ వేడుకను నిర్వహించారు. అనంతరం అలంకరణ మందిరంలో హనుమంతుడిపై స్వామి వారిని కొలువుదీర్చి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ క్షేత్రోత్సవం నిర్వహిం చారు. ఈ వేడుకలను కనులారా తిలకించేందుకు భక్తులు కొండకు చేరుకున్నారు. ఈ కార్యక్రమాలలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి, ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన 'మాలకొండ'



వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తజనం పోటెత్తింది. ప్రత్యేక దర్శనానికి సుమారు 3 గంటలకుపైగా సమయం పట్టింది. క్యూలైన్లలో చంటిపిల్లలు, వృద్ధులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. టెన్త్, ఇంటర్ పరీక్షా ఫలితాలు రావడం, సెలవు రోజు కావడంతో మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అంతేగాక వచ్చే శనివారం నరసింహస్వామి జయంత్యుత్సవం సందర్భంగా ఆ రోజు దర్శనం అందదు అనే ఉద్దేశంతో కూడా భక్తులు తరలివచ్చారు. ఆలయం ప్రాంగణంలో కళాకారుల కోలాటం ఆకట్టుకుంది. కాగా, లక్ష్మీనృసింహస్వామికి శనివారం రూ.12,73,205 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకదర్శనం ద్వారా రూ.4,78,700, అన్నదానం ద్వారా రూ.2,85,930, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,51,270, విరాళాల ద్వారా రూ.1,04,000 తదితర వాటి ద్వారా ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

బడ్జెట్‌కు 'స్పాట్' పెట్టారా!?

- జిల్లాలో టీచర్ల ఎదురుచూపులు
- టెన్త్ పరీక్షలు, స్పాట్‌కు అప్పులే శరణ్యమా..?
- అయ్యోర్లకు బకాయిల చెల్లింపులెప్పుడు...

నెల్లూరు(విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు, మూల్యాంకనం పూర్తయ్యి ఫలితాలు కూడా విడుదలయ్యాయి. పరీక్షల నిర్వహణ, స్పాట్ విధుల్లోనూ పాల్గొన్న అధికారులు, సిబ్బందికి ఇంత వరకు రెమ్యునరేషన్‌లు లేవు, అలవెన్సులూ అందలేదు. పరీక్ష నిర్వహణకు (ఒక్కో విద్యార్థికి రూ.10) అందించే కంటింజెన్సీ చార్జీలు ఇవ్వలేదు. గతంలో పరీక్షలకు ముందే నిధులు విడుదల చేసేవారు. కొత్త జిల్లాలు ఏర్పడినప్పటి నుంచి నిధులు విడుదల చేయడంలేదు.దీంతో అధికారులు వేలాదిమంది టీచర్లు, ఇతర సిబ్బందికి రెమ్యునరేషన్‌లు, అలవెన్స్‌లు అందించలేక పోతున్నారు. జిల్లాలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో జరిగే అన్ని పరీక్షల నిర్వహణ, ఫీజుల వసూళ్లకు ప్రత్యేకంగా పరీక్షల విభాగం పనిచేస్తోంది. ఏడాదిలో ఎన్నో పరీక్షల నిర్వహణ బాధ్యత తీసుకునే ఈ విభాగం విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజు పేరుతో భారీగా వసూళ్లు చేస్తున్నది. అయితే పరీక్షల నిర్వహణకు ఖర్చు పెట్టడానికి మాత్రం వెనకడుగు వేస్తోందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఉదాహరణకు పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.125లు(ఎలాంటి అపరాధరుసుము లేకుండా) వసూలు చేశారు. ఫీజులు ఆలస్యంగా చెల్లించే వారి నుంచి అపరాధ రుసుము పేరుతో మరికొంత అదనంగా వసూలు చేశారు. అంతేకాక అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పేరుతో మళ్లీ పరీక్షలు ఫీజులు, అపరాధ రుసుము ఫీజులు.. ఇవన్నీ కూడా పరీక్షల విభాగం ఖాతాలోకి చేరుతాయి. విధినిర్వహణలో ఉన్నవారికి చెల్లించే భత్యాన్ని కూడా ఇదే నిధుల నుంచి వెచ్చించాలి. అయితే వసూలు చేసిన మొత్తంలో నుంచి కనీసం 10శాతం కూడా వెచ్చించడం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు.

- ఖర్చు మూరెడు.. ఇచ్చేది బెత్తెడు!

టెన్త్ పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగాయి. జిల్లాలో 33,434 మంది రెగ్యులర్ విద్యార్థులు, ఓపెన్ నుంచి మరో 1500 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వీటి నిర్వహణ కోసం కంటింజెన్సీ చార్జీల కింద ఒక్కో విద్యార్థికి రూ.10లు చొప్పున విద్యాశాఖ అందించాలి. ఆ నిధులతోనే పరీక్షల నిర్వహణకు సీల్, దారం, కట్టర్, ఇతర మెటీరియల్ కొనడంతోపాటు తాగునీరు, దానికి అందించే వాటర్‌బాయ్‌కు కూలి, ఇతర అంశాలకు ఖర్చు చేయాలి. ఒక విద్యార్థికి రూ.10లు ఇస్తే ఒక కేంద్రం నుంచి 250 మంది ఉంటే రూ.2500లు, ఏ, బీ పేరుతో రెండు సెంటర్లు ఉంటే రూ.5వేలు చెల్లిస్తారు. పెరిగిన ఖర్చుల నేపథ్యంలో విద్యాశాఖ ఇచ్చే కంటింజెన్సీ చార్జీలు ఏమాత్రం చాలడం లేదంటున్నారు. సీఎస్‌లకు అదనంగా రూ.2వేల వరకు భారం పడుతోందని చీఫ్ సూపరింటెండెంట్‌లు వాపోతున్నారు. పైగా ఇప్పటి వరకు ఇవ్వాల్సిన డబ్బు కూడా ఇవ్వడం లేదని, చేతినుంచి ఖర్చు చేశా మని చెపుతున్నారు. 174 పరీక్ష కేంద్రా లకు 1,968 మంది ఇన్విజిలేటర్‌లతో పాటు 174 మంది సీఎస్‌లు, 174 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 24 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 9 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. వీరు కాకుండా మరికొంత మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు. వీరిలో జిల్లా అబ్జర్వర్‌కు రూ.300లు, సీఎస్‌కు రూ.66లు, డీవో, ఏడీవోలకు రూ.33లు, క్లర్క్‌లకు రూ.33లు, అటెండ ర్లకు రూ.20లు, వాటర్‌మెన్‌కు రూ.17లు, సిట్టింగ్ స్క్వాడ్‌కు రూ.66లు, మెడికల్ స్టాఫ్‌కు రూ.33లు లెక్కన రోజుకు రెమ్యున రేషన్ చెల్లించాలి. కానీ నేటికీ బడ్జెట్ విడుదల కాలేదు.



- స్పాట్‌కూ అందని అలవెన్స్‌లు...

టెన్త్ పరీక్షల మూల్యాంకనం ఏప్రిల్‌లో పూర్తి చేశారు. ఈ విధుల్లో క్యాంప్ ఆఫీసర్లు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు. 1800 మంది వరకు స్పాట్ విధుల్లో భాగస్వాములయ్యారు. వీరికి రోజుకు క్యాంప్ ఆఫీసర్‌కు రూ.495లు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.429లు, చీఫ్ ఎగ్జామినర్‌కు రూ.396లు, స్పెషల్ అసిస్టెంట్‌లకు రూ.300లు, క్లర్క్‌లకు రూ.132లు, ఆఫీస్ సబార్డినేట్స్‌కుర రూ.83లు, చీఫ్ కోడింగ్ ఆఫీస ర్లకు రూ.330లు, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లకు రూ.297 లు చొప్పున చెల్లిస్తారు. ఒక్కో పేపర్ వాల్యూయేషన్ రూ.10ల చొప్పున ఎగ్జామినర్లకు అందిస్తారు. డీఏ కింద రూ.400లతో పాటు ట్రావెలింగ్ అలవెన్స్‌లు అందిస్తారు. ఇవి కూడా నేటివరకు చెల్లించలేదు.

- రెమ్యునరేషన్లపై తీవ్ర విమర్శలు...

టెన్త్ పరీక్షలు, స్పాట్‌కు అందించే రెమ్యునరే షన్‌లు, విడుదల చేసే నిధులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని ధరలు పెరిగి పోయిన నేపథ్యంలో కనీసం రోజువారీ కూలీలు కూడా ఇవ్వక పోవడం బాధాకరమని టీచర్లు అంటున్నా రు. పరీక్షల విధుల్లో పాల్గొన్న వారికి రూ.17లు, రూ.33 లు, రూ.66లు ఇవ్వడం ఏమిటని మండిపడుతున్నారు. చిన్నపాటి కూలి పనికి వెళ్లినా రూ.500 నుంచి రూ.700లు ఇస్తుండగా, మాకు మాత్రం వంద రూపాయలలోపు ఇవ్వడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇవి కూడా సమయానికి అందించకుండా ఇబ్బందులు పెడుతున్నార న్నారు. కేంద్రాల్లో ఏర్పాటు కోసం ఇచ్చే కంటింజెన్సీ ఫండ్‌ను రూ.50లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయ మై జిల్లా అధికారులు మాట్లాడుతూ నిధుల విడుదల కోసం బిల్లులను ట్రెజరీకి అందించాం. అయినా కొర్రీలు పెడుతూ నిధులు మాత్రం విడుదల చేయడం లేదు. దీనిపై రాష్ట్ర ఉన్న తాధికారులకు కూడా నివేదికలు అందించాం. త్వరలోనే నిధులు విడుదల చేస్తామని చెపుతున్నారు. అయితే ఎప్పుడు విడుదల చేస్తారన్న దానిపై స్పష్టత లేదు.

గ్రామ పంచాయతీల గ్రేడ్ల మార్పు

- కసరత్తు ప్రారంభం
- 13న జడ్పీలో ప్రత్యేక సమావేశం
- విధివిధానాలతో రావాలని డిప్యూటీ ఎంపీడీవోలకు ఆదేశం

నెల్లూరు (జడ్పీ), మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీల గ్రేడ్ల మార్పునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఇప్పటికే కసరత్తు ప్రారంభించిన పంచాయతీ రాజ్ శాఖ గ్రేడ్ల మార్పునకు విధి విధానాలను ఖరారు చేసింది. ఈ విషయమై ఈనెల 13న జిల్లా అధికారులు డిప్యూటీ ఎంపీడీవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వం సూచించిన విధివిధానాలతో నివేదికలను సిద్ధం చేసుకుని రావాలని అధికారులకు సూచించారు. అనంతరం తుది నివేదికలను ఉన్నతాధికారులు ప్రభుత్వానికి పంపనున్నారు.

- 10 గంటలకు సమావేశం

పంచాయతీ గ్రేడ్ల మార్పుపై మంగళవారం ఉదయం 10 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు డీపీవో ఎల్. శ్రీధర్‌రెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు వారి కార్యాలయ పరిపాలన అధికారులతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు. అంతేకాక డిప్యూటీ ఎంపీడీవోలు గ్రామాల్లోని ఇళ్ల పన్నులు, స్టాంప్ డ్యూటీ, సీనరేజ్ సర్‌చార్జ్ తదితరాల వివరాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా తయారు చేయించుకుని, వారి సంతకాలతో నివేదికలను తీసుకుని రావాలని డీపీవో తెలియజేశారు. అలాగే ప్రతి గ్రామపంచాయతీ వివరాలను, ప్రభుత్వం జారీ చేసిన్న విధి విధానాలకు అనుగుణంగా రూపొందించుకుని సీఎఫ్ఎంఎస్ సంవత్సరం నివేదిక, ఆడిట్ నివేదికలను తీసుకుని రావాలని కూడా తెలిపారు. గ్రామ పంచాయతీల ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని స్పెషల్ గ్రేడ్, గ్రేడ్ 1, 2, 3 పంచాయతీల సిబ్బంది జాబితాకు సంబంధించి డిప్యూటీ ఎంపీడీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు చర్చించి అవసరమైన సూచనలను లిఖితపూర్వకంగా సమావేశంలో అందజేయాలని తెలిపారు.

50 శాతం రాయితీపై పశుదాణా పంపిణీ

ఉదయగిరి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదయగిరి, గండిపాళెం, కుర్రపల్లి పశు వైద్యశాలల పరిధిలోని పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశుదాణా పంపిణీ చేయనున్నట్లు పశు వైద్యాధికారులు అనూష, వినయ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 50 కిలోల దాణా పూర్తి ధర రూ. 1,110 కాగా 50 శాతం రాయితీ పోను రైతు రూ. 555 చెల్లించాల్సి ఉంటుందన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగినవారు అర్హులన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9316
వెండి కిలో ధర	రూ. 99,100
వెండి ఒక గ్రాము	రూ.102.10

పండ్ల తోటల సాగుకు సబ్సిడీ మంజూరు

● రాజశేఖర్‌రెడ్డి, ఉద్యానాధికారి



అనంతసాగరం, మే 10 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలు సాగుచేసుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనంతసాగరం హార్టికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

? మండలంలో ఏఏ రకాల పంటలు సాగులో ఉన్నాయి. విస్తీర్ణం ఎంత.

! హార్టికల్చర్ పరిధిలో బొప్పాయి, మిరప, మామిడి సాగు 1,500 ఎకరాల్లో ఉన్నాయి.

? సబ్సిడీ ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చా.

! పండ్ల తోటలకు ఇప్పటి వరకు రూ. 85 లక్షల వరకు సబ్సిడీ అందించడం జరిగింది. మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, డ్రాగన్‌ఫ్రూట్, నేరేడు, చింత, ఉసిరి సాగు చేసుకోవచ్చు. రైతుల ఖాతాల్లో నేరుగా సబ్సిడీ పడుతుంది.

? పంటల బీమా, రాయితీ పరికరాలు ఇస్తున్నారా.

! పంటల బీమాపై ఇంకా మార్గదర్శకాలు రాలేదు. 40 శాతం సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు అందజేస్తున్నాం.

సమస్యల వలయంలో వసతి గృహాలు

అద్దె భవనాల్లో విద్యార్థుల అవస్థలు



ఆత్మకూరులో రేకుల షెడ్‌లో కొనసాగుతున్న బీసీ కళాశాల బాలుర వసతిగృహం

ఆత్మకూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కళాశాలల వసతిగృహాల్లో సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. శాశ్వత భవనాలు లేక చాలీచాలని అద్దె భవనాల్లో వసతిగృహాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. ఆత్మకూరు పట్టణంలో బీసీ బాలురు, బాలికల, ఎస్సీ బాలుర వసతిగృహాలు ఉన్నాయి. అయితే బీసీ బాలుర వసతిగృహం గత పదేళ్లుగా అద్దె భవనంలోనే కునారిల్లుతోంది. ప్రస్తుతం అందులో 90 మందికి పైగా పలు కళాశాలల విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే వారికి సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. రేకుల షెడ్లలోనే తలదాచుకుంటున్నారు. సరిపడా గదులు లేక ఇరుకు గదుల్లోనే గడుపుతున్నారు. మరో అద్దె భవనం కోసం వెతుకులాట ప్రారంభించినా ప్రయోజనం లేకపోయింది. అద్దెకు ఇచ్చేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. బీసీ బాలికల కళాశాల వసతిగృహం సైతం అద్దెభవనంలోనే కొనసాగుతోంది. ఇందులో ఈఏడాది 100 మంది విద్యార్థినులకు పైబడి చదువుతున్నారు. అయితే వారికి సరైన వసతుల లేక ఇబ్బందులు పడు తున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ కళాశాలల వసతిగృహాలకు శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం: ఏబీసీడబ్ల్యూఓ

కాగా, ఆత్మకూరు పట్టణంలోని బీసీ బాలుర, బాలికల కళాశాలల వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, శాశ్వత భవనాల నిర్మాణాల కోసం ఉన్నతాధికారులకు నివేదించామని ఏబీసీడబ్ల్యూఓ ఎం శ్రీదేవి తెలిపారు. మెరుగైన వసతులు చేకూరేలా దృష్టిసారిస్తాం అని ఏబీసీడబ్ల్యూఓ ఎం శ్రీదేవి తెలిపారు.

మనస్పర్థలు వీడి టీడీపీ బలోపేతానికి కృషి చేయండి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సీతారామపురం: ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నేతలు

సీతారామపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): మనస్పర్థలు వీడి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని బసినేనిపల్లి నుంచి సీతారామపురం వరకు మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని చిన్ననాగంపల్లి, గుండుపల్లి, గోనువారిపల్లి, పబ్బులేటిపల్లి, జయపురం, మారంరెడ్డిపల్లి, సీతారామపురం గ్రామ పంచాయతీలలో టీడీపీ గ్రామసభలు నిర్వహించారు. అనంతరం కాకర్ల ఆధ్వర్యంలో మండల, గ్రామ నాయకుల సమక్షంలో గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు, మహిళలకు, యువతకు ప్రాధాన్యతనిస్తూ కమిటీలను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మాజీ కన్వీనర్ మొత్తంశెట్టి చెన్నకేశవులు, మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, ఎంపీటీసి తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి, బూత్ ఇన్‌చార్జి తోట మాల్యాద్రి, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర స్వామికి పూజలు

వింజమూరు: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లోని గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. శనివారం సాతువారిపల్లిలో నిర్మించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించడంతోపాటు కోదండ రామస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.

పెళ్లి కానుక అందజేత

ఉదయగిరి : మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన ఇత్తడి తిరుపతిరావు, సుజాతల కుమార్తె అంజలి వివాహం సందర్భంగా శనివారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మకు మహా కుంభాభిషేకం



పోలేరమ్మ, పోతురాజు విగ్రహాలు, గోపుర శిఖరాలకు పూజలు చేస్తున్న అర్చకులు

సంగం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడులో ఉన్న గంగమ్మ ఆలయంలో శనివారం మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. తొలుత కలిశ ప్రతిష్ఠ చేసి గణపతి పూజలు చేశారు. అనంతరం పోలేరమ్మ, పోతురాజు విగ్రహాలు, గోపుర శిఖరాలకు వేదపండితుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల నడుమ క్షీరాధివాసం, అష్టగంగ అభిషేకములు, విశేష పంచామృత అభిషేకములు, తదితర పూజలు నిర్వహించారు. ఈపూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొరిమెర్లలో నాగవరపమ్మ జాతర ప్రారంభం



నాగవరపమ్మకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

మండలంలోని కొరిమెర్లలో ఉన్న నాగవరపమ్మ, పోలేరమ్మ మహా కుంభాభిషేకం, జాతర మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల నడుమ గణపతి పూజతో అమ్మవార్ల జాతర ప్రారంభమైంది. అనంతరం పుణ్యాహవచనం, గోపూజ, అభిషేకాలు తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కరీముల్లా

ఉదయగిరి, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా సూచించారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరించి చెత్తసంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. కేంద్రంలో సిబ్బంది వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయాలన్నారు. మండలంలోని గండిపాళెం, అప్పసముద్రం, జీ.అయ్యవారిపల్లి, ఉదయగిరి పంచాయతీలను మోడల్ ఐవీఆర్ఎస్ గ్రామాలుగా ఎంపిక చేశారన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త నిల్వపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజల కేంద్రం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మాజీ ఎంపీపీ సుబ్బారెడ్డి

ఉదయగిరి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం పంచాయతీ మసీదుపల్లి గ్రామంలో శుద్ధి జల కేంద్రం నిర్మాణానికి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు నీటి సమస్యను సర్పంచ్ నాగరత్నమ్మ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించి రూ.4 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. శుద్ధిజల కేంద్రం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగన్నాథం, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉప్పుటూరి వెంకటేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

ఉదయగిరి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లి గ్రామంలోని కోదండరామ స్వామి ఆలయంలో ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈసందర్భంగా స్వామివార్లకు గణపతి పూజ, పుణ్యాహ వచనం, కలశ స్థాపన, మూలవిరాట్, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం స్వామి వార్ల కల్యాణోత్సవం, సోమవారం పారువేట, వసంతోత్సవం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

బీజేపీ శ్రేణుల పూజలు

ఉదయగిరి, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత సైనికుల్లో మనోధైర్యం నింపాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి, వంశీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పార్వతీ పరమేశ్వరాలయంలో బీజేపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

హాస్టళ్లలో దోమల నివారణ చర్యలు



మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

సీతారామపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు మండలంలోని విద్యార్థుల వసతిగృహాల్లో సబ్ యూనిట్ ఆఫీసర్ నౌషాద్ ఆధ్వర్యంలో శనివారం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ముఖ్యంగా మలేరియా వ్యాధిని అరికట్టేందుకు విద్యార్థులు నిద్రించే గదుల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇవో మజీద్, ఎంపిహెచ్ఏలు శేఖర్‌రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కండలేరు వరద కాలువ లీక్..

కోతకు గురైన ప్రధాన రహదారి

● పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదాలు జరగకుండా నిర్మించిన గోడ

అనంతసాగరం, మే 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల - కలువాయి మార్గంలో పరమానంద ఆశ్రమం వద్ద కండలేరు వరద కాలువ లీకేజీ వాటర్‌తో ఇటీవల ప్రధాన రహదారి కోతకు గురైంది. అయితే ఇంతవరకు పనులు పూర్తిచేయలేదు. ఆప్రాంతంలో డైవర్షన్ రోడ్డు వేసి రోడ్డుకు రెండు వైపులా పిట్టగోడ నిర్మించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో ఈప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై అవగాహన లేని వాహనచోదకులు ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

సోమశిలలో 50.087 టీఎంసీల నీరు

అనంతసాగరం, మే 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శనివారం నాటికి 50.087 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, పెన్నా డెల్టాకు 4,030 క్యూసెక్కులు చేస్తున్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో చిన్నారుల ప్రతిభ

అనంతసాగరం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కాకి చరణ్, సాలవ ఆదర్శ్ బీఆర్ఏజీ సెట్ 2025 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి సీట్లు సాధించడంతో హెచ్ఎం అల్లాబక్షు తదితరులు వారిని అభినందించారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రామచంద్రయ్య

అనంతసాగరం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ రామచంద్రయ్యకు ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న ఐజాక్‌ప్రవీణ్ దీర్ఘకాలిక సెలవు పెట్టడడంతో రామచంద్రయ్య శుక్రవారం విధులు చేపట్టారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉదయగిరి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

C.R.I.M.E N.E.W.S

కరెంటు తీగలు తగిలి యువకుడి మృతి



చిలకా సాయితేజ

బుచ్చిరెడ్డిపాళెం,మే 10 (ఆంధ్రజ్యోతి) బుచ్చిలోని బజాజ్ షోరూం వెనుక ప్రాంతంలో శనివారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై సాయితేజ (17) అనే యువకుడు మృతి చెందాడు. కాశీపాళెంకు చెందిన చిలకా బిందుకు ఇద్దరు కుమారులు. భర్త భానుచందర్ మృతితో కొడుకుల సంరక్షణ భారం ఈమెపైనే పడింది. నిరుపేద కుటుంబం కావడంతో పెద్ద కుమారుడు భాస్కర్‌ను మాత్రమే చదివిస్తోంది. చిన్నకుమారుడు సాయితేజ పనులకు వెళుతుంటాడు. శనివారం సాయంత్రం ఇనుక కమ్మీతో చెత్తను తొలగిస్తూ ఆ కమ్మీ పైకి ఎత్తడంతో చేతికందే ఎత్తులో వున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించే కొడుకు మరణించడంతో ఆ కుటుంబం వీధిన పడ్డట్టు అయ్యింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంతోష్ రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. తీర్థయాత్రలకు వెళ్లిన తల్లి బిందు విషయం తెలియడంతో అన్నవరం నుంచి వెనుదిరిగింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చేపల కోసం వెళ్లి శవమై తేలాడు!

● యాచవరంలో రైతు మృతి

మనుబోలు, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాచవరం గ్రామంలో రాపూరు వీరాస్వామి (55)అనే రైతు శనివారం కండలేరు కాలువలో శవమై కనిపించాడు. స్థానికుల కథనం మేరకు... వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే ఈయన వీలు దొరికనప్పుడల్లా తన పొలాల పక్కనే ఉన్న కండలేరు కాలువలో చేపలు పడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం చేపల కోసమని వెళ్లాడు. రాత్రి ఎంతకీ రాకపోవడంతో కుటుంబీకులతో కలిసి స్థానికులు గాలించారు. ఆచూకీ తెలియక పోవడంతో ఆందోళన పడ్డారు. శనివారం వేకువ జామున కాలువ సమీపంలో అటుగా వెళుతున్న వారికి కాలువలో కూరుకుపోయి ఉన్న వీరాస్వామిని గుర్తించి బంధువులకు తెలిపారు. గ్రామస్తులు, యువకులు వెళ్లి అతన్ని బయటకు తీశారు. చేపల కోసమని దిగితే నీటిలో పాము కరిచిందో, గుంతల్లో కాలుజారి కూరుకుపోయాడో, శరీరంపై అక్కడక్కడ స్వల్పగాయాలు ఉండడంతో కొట్టి పడేశారో తెలియడం లేదని బంధువులు రోదించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

65 ఎకరాల గడ్డివాముల దగ్ధం

● సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం



ఎగిసిపడుతున్న మంటలు

అల్లూరు, మే 10(ఆంధ్ర జ్యోతి):మండలంలోని సింగపేట మజరా మూర్తిరాజపురంలో నాలుగు గడ్డివాములు దగ్ధమైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బాధితులు కథనం మేరకు... రైతులు తలపల శీనయ్య, తలపల ప్రసాద్‌లకు చెందిన 20 ఎకరాల రెండు గడ్డివాములు, మల్లి కళావతికి చెందిన 30ఎకరముల గడ్డివామి, రాచగిరి వెంకట రవణయ్యకు చెందిన 15ఎకరాల గడ్డి వాములు ఒకేదఫా దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా అర్ధరాత్రి మంటలు ఎగసి పడుతుండడాన్ని గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా అదుపులోకి రాకపోవడంతో అక్కడే ఉన్న ఎక్స్‌కవేటర్‌తో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. సమాచారం అందుకున్న కావలి, నెల్లూరులకు చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనతో రైతులకు దాదాపు రూ.3లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టి ఉంటారని, లేకుంటే ఒకచోట ఉన్న రెండు గడ్డివాములతో పాటు దూరంగా ఉన్న మరో రెండు గడ్డివాములు ఒకేసారి అగ్నికి ఆహుతవ్వడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై అల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కావలి సీఐ పాపారావు, ఎస్ఐ కిషోర్‌బాబులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు పాల్పడిన వారిపై చర్య తీసుకుంటామని తెలిపారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

వెంకటాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి): గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలోని ఆర్టీసీ జోనల్ కళాశాల ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తాపడి నలుగురు గాయపడ్డారు. నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న ఆటో మలుపు వద్ద ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా..ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అలాగే ఆటో ముందుభాగం కూడా దెబ్బతింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్య కేసు నిందితుడి అరెస్టు

వెంకటాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి):కట్టుకున్న భార్యను మచ్చు కత్తితో గొంతుకోసి హత్యచేసిన కేసులో పొదలకూరు మండలంలోని వామిటిపర్తికి చెందిన పచ్చిపాల బాబును పోలీసులు అరెస్టు చేశారు. వెంకటాచలం మండలం చవటపాళెం పంచాయతీ అబ్బిసా హెబ్‌కండ్రిగ గ్రామంలో ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి భారతిని ఆమె భర్త బాబు గొంతుకోసి హత్య చేసిన విషయం తెలిసిందే. అరెస్టు చేసిన ఇతన్ని శనివారం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు పచ్చిపాల బాబుకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

రేషన్ బియ్యం పట్టివేత

వెంకటాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి):చవటపాళెం క్రాస్‌రోడ్డులోని జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం విజిలెన్స్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి నెల్లూరు వైపుగా వెళ్తున్న పాల వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా పరిశీలించగా 54బస్తాల బియ్యాన్ని గుర్తించారు. పాల వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



కావలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి):ఉగ్రదాడులు, రైళ్లలో చోరీలను దృష్టి లో పెట్టుకుని కావలి రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. 1వ పట్టణ సీఐ ఫిరోజ్, 1వ పట్టణ, జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్ఐలు సుమన్, మాల కొండయ్య, సుబ్బారావులు సిబ్బందితో కలిసి స్టేషన్ పరిసరాలతో పాటు ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పలు రైళ్లలో కూడా తనిఖీలు నిర్వహించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	140
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	276

కోడిగుడ్ల ధర (100): 500

నూరుబాషా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

కావలిటౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన నూరుబాషా విద్యార్థులకు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు చారిటబుల్ ట్రస్ట్‌చే ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు నూ రుబాషా సంక్షేమ సంఘం (దూదేకుల) నేతలు తెలిపారు. శనివారం పట్టణంలో జరిగిన డివిజన్‌స్థాయి నూరుబాషాల సమావేశంలో సం ఘం జిల్లా అధ్యక్షుడు సలీంబాషా మాట్లాడుతూ పదవ తరగతిలో 500 మార్కుల పైన, ఇంటర్‌లో 900 మార్కులపైన సాధించిన నూరుబాషా విద్యార్థులకు బీఎంఆర్ ట్రస్ట్ సహకారంతో నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 30 లోపల మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జెరాక్స్ జత చేసి మండల అధ్యక్షుడు షేక్ ఖలీల్‌కు అందజేయాలన్నారు. తదుపరి బహుమతులు అందించి తేది ప్రకటిస్తామని తెలిపారు. స్వయంగా ఎంపీనే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మీరాసాహెబ్, షరీఫ్, ఖలీల్, చాంద్‌బాషా, షాన్‌వాజ్, బాదుల్లా, మస్తాన్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కమనీయం సీతారాముల కల్యాణం

ఉలవపాడు, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపట్టపుపాలెం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో శనివారం సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. స్వామివారి కల్యాణోత్సవంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

యోగానంద లక్ష్మీనరసింహుడికి పూజలు

కావలి రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ సంగంలో వెలసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో ముస్తాబు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకు ని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు మంత్రి డీబీవీ స్వామి గుడ్లూరుకు రాక

గుడ్లూరు, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆదివారం గుడ్లూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక విద్యావనరుల కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసి ఉన్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, రాష్ట్ర ఆరోగ్య మండలి ఛైర్మన్ శ్రీహరిరావు పాల్గొంటారు.

'వైసీపీ నేత వ్యాఖ్యలు అర్థరహితం'

బిట్రగుంట, మే 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు వ్యాఖ్యలు అర్థరహితమని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేత కావాలనే నిందారోపణలు చేస్తున్నారని, ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. స్థాయిని మరిచి మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఆయన ఆరోపణలు అబద్ధాలని విజయగణపతి ఆలయం వద్ద ఆదివారం ప్రమాణం చేసేందుకు వస్తానన్నారు. ఈ సమావేశంలో నేతలు కే.వెంకటేశ్వరరెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, ఆర్.విజయ్‌కుమార్, కే.రఘురాంనాయుడు, వై.వెంకటేశ్వర్లురెడ్డి, బీ.ప్రభాకర్, పీ.హర్ష, రామోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

లింగసముద్రం, మే 10 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని లింగసముద్రం, పెదపవని సెక్టార్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఏ రాధాదేవి, నీలాంబరిలు చెప్పారు. శనివారం లింగసముద్రం పంచాయతీ జంపాలవారిపాలెం, పెదపవని ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాల్లో కిషోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కోనూరి శ్రీదేవి, పెదపవని సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రకాశం'లో ప్రాంగణ ఎంపికలు

కందుకూరు, మే 10(ఆంధ్రజ్యోతి): కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో మల్టీ నేషనల్ వర్చుసా ఆధ్వర్యంలో మూడు దశల్లో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చదలవాడ రవికుమార్ శనివారం తెలిపారు. కేపీవో అనాలిస్ట్(హైదరాబాద్) ఉద్యోగాల కోసం నిర్వహించిన ఈ డ్రైవ్‌లో ఈసీఐ, సీఎస్‌ఈ, ఈఈఈ, సైబర్ సెక్యూరిటీ, ఏఐ విభాగాలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి కెరీర్ అవకాశాలను అందించేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే మా కళాశాల లక్ష్యమన్నారు. సాంకేతిక డైరెక్టర్ డాక్టర్ విజయ్ శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.

ఘనంగా పీవీ రావు జయంతి

కందుకూరు, మే 10(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతి వేడుకలు మాలఉద్యోగుల ఆధ్వర్యంలో కందుకూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కట్టా రమేష్, చెక్క సింగయ్య, మాలకొండయ్య, మద్దాల రామారావు, శ్రీనివాసులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా 'పత్తి'!

● గిట్టుబాటు ధర గత ఏడాది కంటే ఎక్కువ ● ఆనందంలో రైతాంగం



అన్నెబోయినపల్లిలో ఏపుగా పెరిగిన పత్తి పైరు

లింగసముద్రం, మే 10(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పత్తి పైరు ఆశాజనకంగా ఉంది. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో గత ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో కొందరు రైతులు వరి పైరు సాగు చేయగా, మరికొందరు వరి సాగు చేయకుండా అలాగే వదిలేశారు. ఆ భూముల్లో ఈ ఏడాది సంక్రాంతి పండుగ తర్వాత పత్తి పైరు సాగు చేశారు. అందులో శాయిపేట, ఇసుకపాలెం, అన్నెబోయినపల్లి, సీతారాంపురం తదితర గ్రామాల్లో రైతులు సుమారు 4వేల ఎకరాల వరకు పత్తి పైరు సాగు చేశారు. ఈ పత్తి పైరు చివరి తడుల కోసం ప్రాజెక్టు అధికారులు ఈనెల 2వ తేదీన నీటిని విడుదల చేశారు.అయితే ముందుగా వేసిన పత్తి ప్రస్తుతం తీత దశకు వచ్చింది. మరో వారం రోజులలో తొలి కోత చేపట్టనున్నట్టు రైతులు చెప్పారు. అయితే పత్తిలో తెగుళ్ల బెడద పెద్దగా లేనందున ఈసారి దిగుబడులు కూడా బాగానే ఉండే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.ఎకరాకు 12 నుంచి 15 క్వింటాలు పత్తి దిగుబడి అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం క్వింటం పత్తి ధర రూ.7200 నుంచి రూ.7500 వరకు ఉన్నట్టు రైతులు తెలిపారు. గత ఏడాది కూడా దిగుబడులు ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు అయ్యిందని, క్వింటం ధర రూ.6,500 వరకు ఉండిందని రైతులు తెలిపారు. ఈ ఏడాది ఈ ధరలు కొంత కాలం కొనసాగినా తమకు గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. ఇదిలాఉండగా ఇటీవల వరి కోతలు పూర్తయిన తరువాత కొంతమంది రైతులు బోర్ల కింద 15 రోజుల క్రితం లేత పత్తి పైరు సాగు చేశారు. ఈ పత్తిలో రైతులు సేద్యపు పనులు కూడా చేస్తున్నారు.

అధిక దిగుబడులు వచ్చే అవకాశం

ఈ ఏడాది కూడా ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో లాభాలు వచ్చే అవకాశం ఉంది. తాను ముందుగా రెండున్నర ఎకరాలు, ఇటీవల రెండున్నర ఎకరాలు సాగు చేశాను. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాను.

- కొనికి బాలకృష్ణ, రైతు, అన్నెబోయినపల్లి

ఎట్టకేలకు ట్రంకురోడ్డుకు మరమ్మతులు



రహదారి దెబ్బతిన్నచోట వేస్తున్న తారురోడ్డు

కావలి, మే 10(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ట్రంకురోడ్డులో పొట్టిశ్రీరాములు విగ్రహం ఎదురుగా దెబ్బతిన్న రహదారికి ఎట్టకేలకు శనివారం మరమ్మతులు చేపట్టారు. పట్టణ నడి బొడ్డున ఉన్న ఆ ప్రాంతంలో రోడ్డు గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అయితే ట్రంకురోడ్డు విస్తరణ పనులుకు నిధులు మంజూరుకావడంతో గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఆరోడ్డు మరమ్మతులకు నోచుకోక ట్రంకురోడ్డు విస్తరణ సమయంలో కొత్త లేయర్ వేస్తారని చెపుతూ వచ్చారు. అయితే అక్కడ గుంతల వలన ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో స్థానికులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డు విస్తరణ పనులతో సంబంధం లేకుండా ఆ ప్రాంతంలో రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని దెబ్బతిన్న రోడ్డుపై కొత్తగా ఒక లేయర్ తారు వేశారు. దీంతో ఎంతో కాలంగా ప్రజలు, వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి.

విపత్తులను ఎదుర్కోవడం ఎలా?



మాట్లాడుతున్న శిక్షకుడు బీద లక్ష్మానంద

కావలి, మే 10(ఆంధ్రజ్యోతి) : ప్రపంచరెడ్ క్రాస్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక క్రిష్టియన్‌పేటలోని డాక్టర్ శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం బేసిక్‌లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యుడు డాక్టర్ పాపమూరు శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శిక్షకుడు బీద లక్ష్మానంద శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వివిధ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సురక్షితంగా సకాలంలో దగ్గరలోని ఆసుపత్రులకు తరలించడం, ప్రాథమిక చికిత్స అందించటంపై వివరించారు. ఎటువంటి వైద్యపరికరాలు లేకపోయినా అందుబాటులో ఉన్న కర్రలు, దుప్పట్లతో స్ట్రెచర్‌గా ఎలా ఉపయోగించాలి, అవి కూడా లేనపుడు చేతులపై ఎత్తుకుని సురక్షిత ప్రాంతాలకు ఎలా చేర్చాలనే దానిపై ప్రదర్శనతో వివరించారు. ఊపిరి తిత్తులు, గుండె ఆగి పోయినపుడు 4 నిమిషాల లోపల సీపీఆర్ ప్రక్రియ ద్వారా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌ఛైర్మన్ కే.హరినారప రెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, పాలకమండలి సభ్యుడు ఎస్‌కే అబ్దుల్ నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

బోయలపాడులో లేగదూడల ప్రదర్శన



బహుమతులు సాధించిన లేగదూడలతో పశుపోషకులు

జలదంకి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణక్రాక పశువైద్యశాల పరిధిలోని బోయలపాడులో శనివారం ఇన్‌చార్జి పశువైద్యాధికారి షేక్ షబ్నాం ఆధ్వర్యంలో ఆరు నెలల లోపు పాలుతాగే ముర్రా జాతి గేదెల లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని 46 లేగదూడలను ప్రదర్శించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్(ఆర్‌జీఎం), పశుసంవర్థకశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో ముఖ్యఅతిథులుగా జిల్లా పశుసంవర్థకశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, కావలి డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ రసూల్‌సాహెబ్ పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో కోట వెంకటేశ్వరరెడ్డికి చెందిన లేగదూడ ప్రథమ, గునుపాటి మల్లికార్జునరెడ్డి, గునుపాటి ప్రభాకరరెడ్డిలకు చెందిన దూడలు ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. మిగిలిన 43 లేగదూడలకు చెందిన కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వైవీ కామేశ్వరరావు, కొండాపురం పశువైద్యాధికారి డాక్టర్ ఆలీ, జేవీవో సామ్రాజ్యం, వెటర్నరీ అసిస్టెంట్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం ప్రసన్నుడి కల్యాణం



కల్యాణ వేదికపై అమ్మవార్లతో కొలువుదీరిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి

లింగసముద్రం, మే 10(ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలో వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వేంకటేశ్వరస్వామి, పద్మావతి, అలివేలు మంగతాయారుల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో లింగసముద్రంతో పాటు బలిజపాలెం, జంగంరెడ్డిపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఆర్టీసీ నెల్లూరు రీజియన్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి



ఛైర్మన్ సురేష్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న నాయకులు

కందుకూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆర్టీసీ నెల్లూరు రీజియన్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కందుకూరు ఆర్టీసీ బస్‌స్టాండ్, గ్యారేజీ సెక్షన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉం డడంతో పనులు చేపట్టేందుకు ఇబ్బందిగా ఉందని, పైగా సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని తెలిపారు. అదేవిధంగా ఉద్యోగులకు విశ్రాంత గదుల అవసరం గురించి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఎంఎఫ్ రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ డిపో మేనేజర్ ప్రసాద్, డబ్ల్యూఎం ఇబ్రహీం, ఈయూ, ఎన్‌ఎంయూ నాయకులు పాల్గొన్నారు. అనంతరం బీజేపీ కార్యాలయాన్ని సందర్శించిన సురేష్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం కందుకూరు డిపో నుంచి మార్కాపురంకు నైట్ సర్వీసులు పునరుద్ధరించాలని, బెంగళూరు, విశాఖపట్నంకు అదనపు సర్వీస్‌లను నడపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాదరావు, మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య నివారణకు చర్యలు

● టీవీ నరసింహం, విద్యుత్‌శాఖ ఏఈ, కందుకూరు



కందుకూరు, మే 10(ఆంధ్ర జ్యోతి): కందుకూరు పట్టణంలో లో ఓల్టేజీ సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కూడా త్వరగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మని విద్యుత్ శాఖ ఏఈఈ టీవీ నరసింహం తెలిపారు.

? కందుకూరులో లోఓల్టేజీ సమస్యను ఎలా పరిష్కరిస్తారు.

! వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరగడంతో లో ఓల్టేజీ సమస్య ఉంది. సింహాద్రినగర్‌లో రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తాం. కోటారెడ్డినగర్, సాయినగర్, వాణినగర్, సంతోష్ నగర్‌లలో వారం, పది రోజుల్లో కొత్తగా మరో 6 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నాం. దీంతో సమస్య పరిష్కారమవుతుంది.

? పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

! గతంలో ఏర్పాటు చేసినవి హెవీలోడ్ కెపాసిటీ కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు కావడంతో కొంత సమస్య ఉంది. ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపడుతాం.

? దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఎప్పటిలోగా ఇస్తారు.

! మండల పరిధిలో 39 కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి సంబంధించి పోల్స్ వచ్చాయి. ఈనెలలో ట్రాన్స్‌ఫార్మర్లు కూడా వస్తాయి. ఇప్పటికే రెండు కనెక్షన్లకు కండక్టర్లు కూడా రావడంతో తక్షణం కనెక్షన్లు ఇచ్చేలా పోల్స్ వేస్తున్నాము. ఈనెలలో కనీసం సగం పూర్తి చేస్తాం.

? నడిరోడ్లపై ఉన్న విద్యుత్‌స్తంభాలతో అసౌకర్యం కలుగుతోంది. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారు.

! చాలా ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ స్తంభాల విషయంలో ఈ సమస్య ఉంది. మరీ ఇబ్బందిగా ఉన్న చోట తక్షణం మారుస్తున్నాం. కొండముడుసుపాలెం రోడ్డులో స్తంభాలను మార్జిన్‌లోకి మార్చేందుకు రూ.11 లక్షలతో అంచనాలు వేసి మున్సిపాలిటీకి ఇచ్చాం.

అడ్డాలు మారుస్తూ..

జోరుగా జూదం!

వలేటివారిపాలెం, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఅమ్మపాలెం, చుండి, పోలినేనిచెరువు, రామలింగాపురం, అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం, అంకభూపాలపురం, వీరన్నపాలెం తదితర గ్రామాల్లోని అడవులు, పొలాల్లో పేకాట జోరుగా సాగుతోంది. ఎవరికీ పట్టుబడకుండా అడ్డాలు మార్చుతూ ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. పక్కా నిఘాతో వీళ్ల ఆట కట్టించాల్సిన పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పేకాటరాయుళ్లు పోలీసుల్లో కొందరిని మచ్చిక చేసుకొని పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. లక్షల రూపాయలు చేతులు మారుతూ సాగుతున్న ఈ జూదంలో కొందరి జీవితాలు తలకిందులవుతున్నాయి. కందుకూరు, సింగరాయికొండ, టంగుటూరు, ఒంగోలు, కావలి, పొన్నలూరు, లింగసముద్రం, గుడ్లూరు తదితర మడలాలలకు చెందిన పేకాటరాయుళ్లు కారుల్లో వచ్చి పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. పేకాట ఏ రోజు ఎక్కడ అనేది ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చుకుంటూ జనసంచారం లేని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. మెయిన్ రోడ్డుకు రెండు కిలోమీటర్ల దూరంలో అడవుల్లో పేకాట నిర్వహిస్తూ ఆ ప్రాంతానికి నాలుగు వైపులా తమ వ్యక్తులకు కొంత నగదు ఇచ్చి కాపలా పెడుతున్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అటు వైపు వెళ్తుంటే వెంటనే ఆ వ్యక్తులు పేకాటరాయుళ్లకు సమాచారం అందిస్తారు. దీంతో వారు అప్రమత్తమై వెళ్లిపోతున్నారు. రాత్రిళ్లు కూడా ఫోన్ లైట్లు వేసుకొని పేకాట సాగిస్తున్నట్లు సమాచారం. పేకాటరాయుళ్లకు సపర్యలు చేసేందుకు ఒకరిద్దరు అక్కడే ఉండి వారికి కావల్సిన తినుబండారాలు, టీ, టిఫిన్ సిగిరెట్, గుట్కాలు, మద్యం తెచ్చి ఇస్తుంటారు. గతంలో కాకర్లవారిపాలెం సత్రం వద్ద పేకాటరాయుళ్ల మధ్య ఏర్పడిన వివాదాలతో కాపలా పెట్టిన వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. అప్పట్లో పేకాటరాయుళ్ల పోలీసుల సహకారంతో ఆ ఘటన హత్య కాదు రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి తప్పించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ జూదం వల్ల లక్షలాది రూపాయలు పోగొట్టుకున్న వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత పోలీస్ అధికారులు స్పందించి పేకాట శిబారాలపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై పడిన చెట్లు తొలగించరా?



కలిగిరి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రాంతాల్లో 4 రోజుల క్రితం గాలివాన బీభత్సంతో హోర్డింగులు, చెట్లు కూలిపోయాయి. ఈ క్రమంలో కలిగిరి-కొండాపురం ప్రధాన రహదారిలో చినచెరువు సమీపాన రోడ్డుపై అడ్డంగా చెట్టు పడిపోయింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణం చేసే వాహనదారులు రోడ్డు పై పడిన చెట్టు కొమ్మలు కొంత విరిచి చిన్నపాటి వాహనాలు వెళ్లడానికి మార్గం సుగమం చేసుకున్నారు. అదే విధంగా ఈ మార్గంలోనే మరోచెట్టుకూడా రోడ్డుపైన పడిపోయింది. భారీ వాహనాలు వచ్చినపుడు రోడ్డు మార్జిన్ దిగి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై అడ్డంగా పడిన చెట్లు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

యథేచ్ఛగా బెల్టు

నామమాత్రంగా ఎక్సైజ్ దాడులు ● అదనంగా నగదు వసూళ్లతో మందుబాబులకు నష్టం



కొండాపురంలోని మద్యం దుకాణం

కొండాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి పొందిన మద్యం దుకాణాల్లోనే మద్యం అమ్మకాలు చేపట్టాలని చెబుతున్నా మండలంలో ఆ పరిస్థితి లేదు. ప్రతి గ్రామంలోనూ కొందరు మద్యం బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్నారు. అదనంగా నగదు వసూలు చూస్తూ ప్రజల అందికాడికి నగదు దండుకుంటున్నారు. బెల్టు దుకాణాల నిర్వాహకులపై దాడులు చేసి కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నా తిరిగి అదేపని చేస్తున్నారు.

● మండలానికి మూడు మద్యం దుకాణాల కేటాయింపు

మండలానికి మూడు మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ దుకాణాలను లాటరీద్వారా దక్కించుకున్న వ్యక్తులు మండల కేంద్రంతో పాటు తూర్పుఎర్రబల్లి, సత్యవోలు గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారు. మండలంలో 19 పంచాయతీలుండగా అందులో 60 గ్రామాలు న్నాయి. ప్రతి గ్రామంలోనూ రెండు అంతకంటే ఎక్కువసంఖ్యలో బెల్టు దుకాణాలు ఉన్నాయి. మద్యం దుకాణంలో రూ.100 ఉన్న సీసా రేటు బెల్టు దుకాణంలో రూ.150లకు విక్రయిస్తున్నారు. కేటాయించిన దుకాణానికి వెళ్లాలంటే వ్యయ ప్రయాసలవుతున్నాయన్న నెపంతో మద్యం ప్రియులు అదనపు ధర చెల్లించి కొంటున్నారు.

● నామమాత్రంగా ఎక్సైజ్ దాడులు

బెల్టు దుకాణల సమచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేస్తున్నారు. కొన్నిచోట్ల మద్యం దొరుకుతుండగా మరికొన్ని చోట్ల మద్యం దొరకడంలేదు. మద్యం దొరికిన వ్యక్తి ఏ దుకాణం నుండి కొనుగోలు చేశారో సదరు దుకాణంపై కేసు నమోదు చేయడం లేదని సమాచారం. ఈ సమస్యతో బెల్టు లేకుండా చేస్తామన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతోంది. ఈ విషయంపై వింజమూరు ఎక్సైజ్ అధికారులను వివరణ కోరేందుకు ఫోనులో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు ● తక్కువ నగదుతో అధిక ఆదాయం ఆశ చూపుతూ మోసం
- మాయమాటలు చెప్పి రూ. కోట్లు కాజేస్తున్న వైనం
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా... ప్రజల్లో కనిపించని మార్పు



● ఆన్‌లైన్‌లో కొంత నగదు పెట్టుబడి పెడితే అధిక ఆదాయం పొందవచ్చు. తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు. మా యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోండి. అందులో పెట్టుబడి పెట్టండి.

- నగరంలోని ఓ వ్యక్తికి అవతలి వ్యక్తి నుంచి ఫోన్

● మీపై ఢిల్లీలో కేసు నమోదు అయింది. మిమ్మల్ని హౌస్‌అరెస్ట్ చేస్తున్నాం. మేము అడిగినంత నగదు ఇస్తే కేసు మాఫీ చేస్తాం... లేకుంటే అరెస్ట్ ఖాయం.

- నగరంలోని ఓ ఉన్నతాధికారికి బెదిరింపు ఫోన్ కాల్

నెల్లూరు(క్రైం), మే 10 (ఆంధ్రజ్యోతి): ఇలాంటి ఫోన్‌కాల్స్ జిల్లాలో ప్రతి రోజూ ఎవరికో ఒకరికి వస్తూ నే ఉన్నాయి. వారిని నమ్మి వారు చెప్పినట్టుగా చేసి చివరకు మోసపోతున్నవారు ఎందరో ఉన్నారు. కొందరు పరువు కోసం బయటకు చెప్పుకోలేక పోతున్నారు. మరికొందరు చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు డబ్బులు పోగొట్టుకున్నాక పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని జిల్లాలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఓ వైపు పోలీసులు ఇలాంటి నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా... మరోవైపు నిత్యం ఎవరో ఒకరు మోసపోతూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు.

ఇటీవల వెలుగులోకి వచ్చినవి..

- ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో నగదు పెట్టుబడిగా పెడితే షేర్స్‌లో మంచి ఆదాయం వస్తుందని సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు నమ్మి నగరానికి చెందిన ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో పలు దఫాలుగా రూ.2.46 కోట్లకుపైగా డిపాజిట్ చేసి మోసపోయింది.
- డిజిటల్ అరెస్ట్ ద్వారా జిల్లాలో ఓ వ్యక్తి రూ.7.8 కోట్లు పోగొట్టుకున్నాడు. మరో వ్యక్తి రూ.98 లక్షలు పోగొట్టుకున్నాడు.
- వాట్సప్ చాట్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.1.96 కోట్లు కాజేశారు.
- పీఎమ్ కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్ ఫ్రాడ్స్ ద్వారా మరో వ్యక్తి నగదు పోగొట్టుకున్నాడు.
- ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ ద్వారా రూ.10 లక్షల నగదును ఓ అధికారి చేజార్చుకున్నాడు.



పోలీసులు అరెస్ట్ చేసిన సైబర్ నేరగాళ్లు, స్వాధీనం చేసుకున్న సొత్తు (ఫైల్)



వెంటనే ఫిర్యాదు చేయండి

సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాల బారిన పడిన ప్రజలు వెంటనే సైబర్ మిత్ర వాట్సప్ నెంబరు 9121211100, 1930, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ అయిన సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లకు సమాచారం తెలియజేయాలి. వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవచ్చు. సైబర్ నేరాల పట్ల ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలి.

- ఎస్పీ జీ. కృష్ణకాంత్

మోసపోకుండా..

- మీ బ్యాంకు ఖాతాను వేరేవాళ్లు ఆపరేట్ చేయడం లేదా కమీషన్ తీసుకొని మీ ఖాతాను అద్దెకు ఇవ్వడాన్ని మనీ మ్యుల్స్ అంటారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి.
- సైబర్ నేరగాళ్లు నిరక్షరాస్యులను, నిరుద్యోగులను, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకొని, వాళ్లకు డబ్బు ఆశ చూపించి వాళ్ల చేత ఖాతాను ఓపెన్ చేయిస్తారు. ఆ ఖాతాను క్రైమ్ చేయడానికి ఉపయోగి స్తున్నారు. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోమని చెప్పి ప్రజల వద్ద నుంచి డాక్యుమెంట్స్ సేకరించి వాళ్లకి తెలియకుండానే బ్యాంకు ఖాతాను సైబర్‌నేరగాళ్లు ఓపెన్ చేస్తున్నారు. సైబర్ నేరాల్లో నగదు పోగొట్టుకున్న వారు పెట్టిన కేసుల్లో అమాయకులు, ఖాతాలను రెంట్‌కు ఇచ్చిన వారు ఇరుక్కుంటున్నారు. దీంతో వారి ఖాతా ఫ్రీజ్ కావడమేకాకుండా వారు అరెస్ట్ కూడా అవుతున్నారు.
- పార్ట్‌టైమ్ జాబ్ అని చెప్పి మీ ఖాతాను వాడుకోవడానికి ఇవ్వాలని కోరడం, ఎక్కువ డబ్బులు ఇస్తామని ఎవరైనా సంప్రదిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి.
- మీకు తెలియని వారి నుంచి డబ్బులు స్వీకరించడం లేదా ఫార్వాడ్ చేయడం టాంటివి చేయకూడదు.
- ప్రీ పెయిడ్ టాస్కల ఫ్రాడ్, నకిలీ వెబ్‌సైట్స్‌లో ఇన్వెస్టుమెంట్ ఫ్రాడ్, యూట్యూబ్‌లో వీడియోలకు లైక్స్, రివ్యూల ద్వారా అధిక నగదు సంపాదించవచ్చని, ఫ్లైట్ టికెట్స్ బుక్ చేస్తే అధిక నగదు సంపాదించవచ్చని, ఫేక్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అపరిచిత వ్యక్తులు స్నేహితులుగా మారి ఫారెన్ నుంచి గిఫ్ట్ పంపుతామంటే నమ్మకూడదు.
- అనుమానిత నెంబర్స్ నుంచి వచ్చే మెసేజ్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించకూడదు.
- ఎవరూ కూడా వ్యక్తిగత వివరాలను అనామకులకు, తెలియని వ్యక్తులకు ఇవ్వడం మంచిది కాదు.
- వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో గోప్యంగా ఉంచాలి, ప్రొఫైల్ లాక్ పెట్టుకోవాలి.
- సైబర్ జరిగిందని తెలిసిన వెంటనే సైబర్ క్రైమ్ కంప్లైంట్‌ను గోల్డెన్ అవర్స్‌లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన వారి ఖాతాకు రీఫండ్ అయ్యే చాన్స్ ఎక్కువగా ఉంది.



బ్రాంజ్ మెడల్ సాధించిన క్రీడాకారులు

ఖేలో ఇండియాలో జిల్లా క్రీడాకారుడి ప్రతిభ

నెల్లూరు(విద్య), మే 10 (ఆంధ్రజ్యోతి) : బిహార్‌లో జరిగిన ఖేలో ఇండియా యూత్ ఆర్చరీ పోటీల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరుకు చెందిన తరుణీష్‌జాత్యా పతకం సాధించాడని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పోటీల్లో ఏపీ నుంచి గూడూరుకు చెందిన తరుణీష్‌జాత్యా, విజయవాడకు చెందిన వైష్ణవి కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొని బ్రాంజ్‌మెడల్ సాధించారన్నారు. రాష్ట్రానికి పతకం సాధించడంలో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరచడం అభినందనీయమని వారు తెలిపారు. ఈ సందర్భంగా పతకం సాధించిన క్రీడాకారులకు కోచ్ శివశంకర్ అభినందించారు.

సివిల్ సప్లయిస్‌లో సంస్కరణలు

- వచ్చేనెల 7 వరకు రేషన్‌కార్డులకు దరఖాస్తు ● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్

నెల్లూరు (హరనాథపురం) మే 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సివిల్ సప్లయిస్‌లో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందన్నారు. కొత్తగా రేషన్‌డీలర్ల నియామకానికి చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ సరుకులు అందించేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైందని చెప్పారు. జూన్ 7 వరకు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరిస్తారని తెలిపారు. కొత్త కార్డులకు జారీ అయ్యాక 21రోజుల్లో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌వో విజయ్‌కుమార్, ఏఎస్‌వో అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పక్కన డీఎస్‌వో, ఏఎస్‌వో

● టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు

రేషన్ కార్డులకు దరఖాస్తులు, ఇతర సమస్యల పరిష్కారం కోసం జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయంలో 99517 78716 నెంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. కొత్త బియ్యం కార్డులతోపాటు ఇతర రేషన్ సమస్యలు ఉంటే ఈ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని వేమిరెడ్డి వివరించారు.

విద్యారంగ సమస్యలపై రేపు ధర్నా

నెల్లూరు (విద్య), మే 10 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై సోమవారం నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు యూటీ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ తెలిపారు. నగరంలోని విద్యాశాఖ కార్యాలయంలో శనివారం డీఈవో బాలాజీ రావుకు యూటీఎఫ్ నేతలు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పాఠశాల పునర్వ్య వస్థీకరణలో లోపాటు, ప్రమోషన్స్ బదిలీల్లో ఉన్న సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. బదిలీలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను వెంటనే విడుదల చేసి ఉపాధ్యాయుల్లో ఉన్న గందరగోళానికి తెరదించాలన్నారు. డైట్‌లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఉపాధ్యాయులకు రీపో స్టింగ్ ఆర్డర్‌తో మిగులు ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు వీరిని కేటాయించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. జిల్లాలో మాత్రం ఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులు మిగులు ఉపాధ్యాయులుగా సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దీన్ని సవరించి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలన్నింటిపై ఈనెల 12న పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.



డీఈవోకి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి చెక్కు అందచేస్తున్న ప్రవీణ్

దేశ రక్షణ నిధికి రూ.25 వేల వితరణ

కందుకూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీసత్య సాయి జ్యూవెలరీ దుకాణం యజమాని కాకుమాని ప్రవీణ్‌కుమార్ దేశ రక్షణ నిధికి తన వంతు బాధ్యతగా రూ.25,000 వితరణ చేశారు. దీనికి సంబంధించిన చెక్కును శనివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కలిసి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ భద్రత కోసం అహర్నిశలు కష్టపడుతున్న రక్షణ దళాలకు, వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా దేశ పౌరులుగా బాధ్యతాయుతంగా సహాయ సహకారాలు అందించాలన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ రక్షణ వ్యవస్థ బలోపేతంగా పని చేస్తుందని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్ఫూర్తితో దేశ రక్షణ నిధికి తన వంతు బాధ్యత నిర్వర్తించాని ప్రవీణ్ తెలిపారు.

మద్యం, మత్తు నుంచి యువతను కాపాడాలి

- ఐద్వా, డీవైఎఫ్ఐ నేతల నిరసన ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న ఐద్వా, డీవైఎఫ్ఐ నేతలు, మహిళలు

నెల్లూరు (వైద్యం) మే 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలో దారుణ హత్యలు జరుగుతున్నాయని వాటికి మద్యం, మత్తు పదార్థాలే కారణమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ అన్నారు. శనివారం డాక్టర్ జెట్టి శేషారెడ్డి భవనం నుంచి ముత్తుకూరు బస్టాండ్ వరకు మద్యం, మత్తు పదార్థాలపై ఐద్వా, డీవైఎఫ్ఐ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మద్యం, మత్తు పదార్థాల చలామణి అధికంగా ఉందని, ఫలితంగా హత్యలు ఎక్కువయ్యాయన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ మద్యం, మత్తు వంటి వాటికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటం వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సన్నగిల్లు తున్నాయని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, నగర అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, సుబ్బమ్మ, వరలక్ష్మి, షంషాద్, ప్రమీల, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువత చదవడంలేదు.. రాయడం లేదు !

- కథారచయిత అద్దేపల్లి ప్రభు



పురస్కారాలు అందుకున్న మునిసురేష్‌పిళ్లై, ఆర్‌సీ.కృష్ణస్వామి తదితరులతో నిర్వాహకులు గోవిందరాజు సుభద్రాదేవి

నెల్లూరు (సాంస్కృతికం) మే 10 (ఆంధ్రజ్యోతి): నేటి యువత నవలల్ని, ఇతర సాహిత్యాన్ని చదవడం లేదు, రచనలు కూడా చేయడం లేదని కథారచయిత అద్దేపల్లి ప్రభు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని మాగుంటలే అవుట్‌లో ఉన్న ఓ ప్రైవేటు స్కూలులో గోవిందరాజు సీతాదేవి జాతీయ స్థాయి సాహితీ పురస్కారం సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. రచనలపై జీవించే వారు నేడు ఎవరూలేరు. కానీ సమాజహితం కోసం, సాహిత్యం, భాష జీవించేందుకు రచనలు చేయాలని కోరారు. సభకు నిర్వాహకురాలు గోవిందరాజు సుభద్రాదేవి మాట్లాడుతూ తమది రచయితుల కుటుంబమని, సీతాదేవి, ఆమె సోదరి యద్దనపూడి సులోచనారాణి తనకు అమ్మ, పిన్నమ్మలని తెలిపారు. కవులను ప్రోత్సహించేందుకు ప్రతిఏటా తన తల్లి సీతాదేవి పేరిట జాతీయ పురస్కారాలు అందిస్తున్నామన్నారు. అనం తరం కవులను సన్మానించి, పురస్కారాలు అందజేశారు. రచయిత ముని సురేష్‌పిళ్లై మాట్లాడుతూ తనకు పురస్కారం లభించడం సంతోషంగా ఉందన్నా రు. మరో పురస్కార గ్రహీత ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు మాట్లాడుతూ తన నవ లకు రెండోసారి జాతీయ పురస్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ సుంకర గోపాల్, డాక్టర్ పెళ్లూరు సునీల్, రచయిత్రి ఎస్‌వీఎం.గాయత్రి పుర స్కారం అందుకున్న రచనలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కవి సమ్మే ళనం జరగ్గా, పలువురు కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ శివరాకేష్

గొలుసు దొంగల ముఠా పట్టివేత

- 14 సవర్ల బంగారం రికవరీ ● నలుగురు యువకుల అరెస్టు
- 5రోజుల్లో ఛేదించిన మనుబోలు పోలీసులు



సేకరించిన బంగారు నగలు

మనుబోలు, మే 10(ఆంధ్రజ్యోతి):ఎట్టకేలకు చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడుతున్న ముఠాను మనుబోలు పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. ఈ నెల 5న మనుబోలులోని పిడూరు రోడ్డు మార్గం లో చెన్ను రమణమ్మ అనే వృద్ధురాలి మెడలోంచి బంగారు నగల ను చైన్ స్నాచర్ల ముఠా దోచుకెళ్లింది. అప్పటినుంచి ఈ ముఠా కో సం మనుబోలు ఎస్ఐ శివరాకేష్, సిబ్బందితో గాలింపుచర్యలు చే పట్టారు. అందులో భాగంగా వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అనుమా నంగా సంచరిస్తూ, పారిపోయేందుకు ప్రయత్నించిన వీరిని పోలీ సులు తనదైన శైలిలో విచారించగా ఒకటా.. రెండు పదుల సంఖ్య లో దొంగతనాల వివరాలు బయటపడ్డాయి. దీనిపై నెల్లూరు డీఎ స్పీ శ్రీనివాసరావు ఆదేశాలతో ఎస్ఐ విలేకరుల సమావేశం నిర్వ హించి వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా గూడూరు నర్సింగ రావు పేటకు చెందిన హేమంత్ డబ్బుల కోసం దొంగతనాలకు అ లవాటు పడ్డాడు. ఆరునెలల క్రితం తోటపల్లి గూడూరు, ము త్తుకూరు మండలాల్లో చోరీలు చేశాడు. తరువాత గూడూరు జానకిరామ్ పేటకు చెందిన దువ్వూరు మహేష్, మాళవ్యనగర్‌కు చెందిన కంకి శ్రీహరి, సైదాపురం మండలం చాగణం గ్రామానికి చెందిన రాగిపాటి శివమణిలతో కలిసి తనతో పాటు చోరీలకు తీసుకెళ్లేవాడు. వీరంతా ఒక ముఠాగా తయారై చైన్ స్నాచింగ్‌లను ఎంచుకున్నారు. నాలుగునెలల కాలంలో తిపవరప్పాడు, గూడూరు, మనుబోలులో నాలుగు చైన్ దొంగతనాలు చేశారు. ఈ నేరాలకు పాల్పడిన వారంతా యువకులే. వీరినుంచి 4 కేసులకు సంబంధించి 14 సవర్ల బంగారు నగలను రికవరీ చేశారు. నలుగురుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం జరిగిన 5రోజుల్లోనే కేసు ఛేదించిన సీఐ, ఎస్ఐను, సిబ్బందిని ఎస్పీ జి.కృష్ణకాంత్ అభినందించారు.

పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం

- ఎఫ్ఎఫ్‌సీ శంకుస్థాపనలో మంత్రి నారాయణ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతూ నియోజకవర్గానికి ఒక ఎంఎస్‌ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో రూ.12కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్‌ఎంఈ ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు (ఎఫ్ఎఫ్‌సీ) శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఒకే కాంప్లెక్స్‌లో క్లస్టర్లు, యునిట్లు నెలకొల్పేందుకు ఎఫ్ఎఫ్‌సీని జీ+2 భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవనంలో 26 యునిట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటిలో ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారుచేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యంగా చెప్పుకొచ్చారు. అనంతరం రంగనాయుకులపేటలో బీసీ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. 4,967 మందికి ఉచితంగా మిషన్లు ఇవ్వడంతోపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే సింహపురికాలనీలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ పార్క్, చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్క్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, ఆర్డీవో అనూష, కమిషనర్ నందన్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, డీజెడ్ఎం సురేష్‌కుమార్, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, అనురాధ, విజేతరెడ్డి జహీర్, సాఫియా ముజీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

● ప్రతి కుటుంబం నుంచి వ్యాపారవేత్త రావాలి

నెల్లూరురూరల్ : రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త కావాలనే ఆశయంతో సీఎం చంద్రబాబు ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. పాక్‌పై భారత్ జరుపుతున్న ప్రతీకార దాడులను స్మరించుకుంటూ మండలంలోని ఆమంచర్ల వద్ద భారత్ సిందూర్ పేరిట ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పార్కుకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 60 ఎకరాల్లో ఇక్కడ పారిశ్రామికవాడ నిర్మించనున్నామని తెలిపారు. మరో 90 ఎకరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. తాను చెన్నై, కోయంబత్తూరుకు వెళ్లి పెట్టుబడుదారులను ఆహ్వానిస్తామని వెల్లడించారు. ఇక్కడకు వచ్చిన వ్యాపారులకు సమస్యలు తలెత్తితే 48 గంటల్లో పరిష్కస్తామని ప్రకటించారు. యుద్ధంలో అశువులు బాసిన వీరసైనికుడు మురళీనాయక్‌కి ఘననివాళి అర్పిస్తున్నామని తెలిపారు. ఈఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జడ్ఎం శివకుమార్, టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, మలినేని వేణు నాయుడు, చిరంజీవి, ప్రదీప్, వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



భారత్ సిందూర్ ఎంఎస్‌ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

అదనపు సబ్‌స్టేషన్ నిర్మాణానికి నేడు భూమిపూజ

బుచ్చిరెడ్డిపాళెం, మే 10 (ఆంధ్రజ్యోతి): పంచేడులో అదనపు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేయనున్నట్లు శనివారం ఆ శాఖ ఏడీఈ సతీష్ తెలిపారు. బుచ్చి సబ్ స్టేషన్‌పైన వున్న ఓవర్ లోడును తగ్గించేందుకు అదనపు సబ్ స్టేషన్ మంజూరు చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం సబ్‌స్టేషన్ నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భూమిపూజ చేస్తారని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9316
వెండి కిలో ధర	రూ. 99,100
వెండి ఒక గ్రాము	రూ.102.10

న్యూస్ బాక్స్

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దువ్వూరు పావని, మధుసూదన్‌రెడ్డి దంపతులు

ఇందుకూరుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిముసలిలో వెలసిన శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ దువ్వూరు పావని, మధుసూదన్ రెడ్డి దంపతులు వేడుకలకు వచ్చిన భక్తులకు శనివారం అన్నదానం చేశారు.

కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

వెంకటాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతీ నగర్‌లోని అక్షర విద్యాలయంలో ఆదివారం నుంచి ఎన్‌సీసీ శిక్షణ శిబిరం కొనసాగుతున్నట్లు ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ బాలబ్రహ్మచారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10రోజులుగా ఈ శిబిరం జరుగుతుందని ఇందులో వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి 650మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. కల్నల్ కరంచంద్, అరుణ్‌కుమార్, ఆర్మీ సిబ్బంది, ఎన్‌సీసీ అధికారుల ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు పంచాయతీ చింతలపాళెం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నెల్లూరులోని కోట్టమిట్ట ప్రాంతానికి చెందిన ఇలియాజ్, ఖాదర్ బాషాలిద్దరూ దైవదర్శనానికి మోటర్ బైక్‌పై కసుమూరు దర్గాకు వెళ్లి తిరిగి వస్తుండగా మలుపు వద్ద గేదెలు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చాయి. దీంతో బైక్ అదుపుతప్పి గేదెను ఢీకొని బోల్తా పడింది. క్షత గాత్రులను కసుమూరు పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనాల తనిఖీ

కొడవలూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తురాజు పాలెంలో ఎస్ఐ కోటిరెడ్డి శనివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలను పరిశీలించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. ఎక్కడైనా గంజాయి, అక్రమ మద్యం సరఫరా వంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే అతివేగం ప్రమాదకరం అన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు మంత్రి డీబీవీ స్వామి గుడ్లూరుకు రాక

గుడ్లూరు, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదివారం గుడ్లూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక విద్యావనరుల కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసి ఉన్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పొలాలు కనుమరుగు..



కోవూరు సమీపంలోని లేఅవుట్

కోవూరు, మే 10 (ఆంధ్రజ్యోతి):పట్టణ పరిసర ప్రాంతంలోని పొలాలన్నీ రియల్‌ఎస్టేట్లుగా రూపాంతరం చెందుతున్నాయి. నెల్లూరు పట్టణానికి కోవూరు, పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం, పాటూరు గ్రామాలు దగ్గర ఉండటంతో పొలాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లుగా మార్చుతున్నారు. వీటి ఏర్పాటుకు 'నుడా' ప్రత్యేక నిబంధనలు విధించినా ఎవరూ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వీరు వ్యవహరిస్తుండటంతో వ్యవసా యభూములన్నీ వ్యవసాయేతర స్థలాలుగా ఉపయోగించకుంటున్నారు. పడుగు పాడు, కోవూరు, పోతిరెడ్డిపాళెం గ్రామాలకు నాలుగువైపులా ఇప్పుడు పొలాలు కనిపించడం లేదు. ఇప్పుడంతా లేఅవుట్ల ఫ్లెక్సీ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పొలాల్లో రాళ్లు పాతి రియల్ ఎస్టేట్లుగా అమ్మకానికి పెడుతున్నారు. పంచాయితీ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, నుడా అధికారులకు పెద్దమొత్తంలో మాముళ్లు ముట్టచెబుతుండటంతో వాటిజోలికి వెళ్లడం లేదనే ఆరోపణ లున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.

● 'నుడా' రీ సర్వే చేస్తోంది

అనుమతులు లేకుండా పొలాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టడం చట్టరీత్యా నేరం. ప్రస్తుతం పంచాయతీకి ప్రాధాన్యత లేకుండా పోయింది. నేరుగా నుడా నుంచి అనుమతులు తీసుకుంటున్నారు. అడిగితే అనుమతి పత్రాలు చూపుతున్నారు. నుడా లే అవుట్ల విషయమై రీ సర్వే చేస్తోంది. అనంతరం అనుమతులేని లేఅవుట్లు బయటపడుతాయి.

- శ్రీనివాసులు, కార్యదర్శి, కోవూరు

విడవలూరులో క్యాసీనో కేంద్రాలు

● గాదెలదిన్నె, రామతీర్థం, ఊటుకూరులో జోరుగా పేకాట, కోడి పందెలు

● వీధిన పడుతున్న కుటుంబాలు ● పట్టించుకోని అధికారులు





విడవలూరు, మే 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని చెరువులు, పైడేరు, పెన్నా పరివాహక, సముద్ర తీరప్రాంతాలు జూదాలకు కేంద్రాలు మారాయి. నెల్లూరు, అల్లూరు, ఇస్కపల్లి, జువ్వలదిన్నె, కావలి, తడ, సూళ్లూరు పేట నుంచి వందల మంది జూదగాళ్లు మండలానికి వచ్చి లక్షల్లో పందెలు కాచి ఆడుతున్నారు. యువతతో పాటు రైతులు అప్పులు చేసి మరీ జూదాలు ఆడుతుండటంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఇలాంటి సమస్యతో ఇటీవల ఊటుకూరు పెద్దపాళెంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వీరికి కొందరు వ్యక్తులు సకల సదుపాయాలను అమరుస్తూ మండలాన్ని క్యాసినో కేంద్రంగా మార్చేశారు. ఈ వ్యవహారం ఇంటలిజెన్స్, స్థానిక పోలీసులకు ఫిర్యాదులు అందినావారు పట్టించుకున్న దాఖలాలు లేవు. రోజుకొక ప్రాంతంలో పేకాట, కోడి పందెలు జరుగుతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల గాదెలదిన్నె, పురిణి పరిసర ప్రాంతాల్లో జరుగున్న కోడి పందెలపై అల్లూరు మండల పోలీసులు దాడులు చేసి ఐదుగురి అదుపులోనికి తీసుకోవటంపై స్థానిక పోలీసులపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పుణ్య క్షేత్రంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులు అందలేదు

మండలంలో పేకాట, కోడి పందెలు జరుగుతున్న ట్లు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. అసాంఘిక కా ర్యక్రమాలకు పాల్పడితే దాడులు చేసి కేసులు నమోదు చేస్తాం.

- నరేష్ కుమార్ యాదవ్, విడవలూరు ఎస్ఐ

చేమ పంట సాగు రైతుల దిగాలు

● అనుకూలించని వాతారణంతో పంటకు కుళ్లు తెగులు

● తగ్గిన దిగుబడులు ● ఆర్థికంగా కుదేలవుతున్న రైతన్నలు



మండలంలో సాగవుతున్న చేమపంట

ఇందుకూరుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి):చేమ పంటసాగుతో రైతులు నష్టాలతో కుదేలవుతున్నారు. మండలంలోని డేవిస్‌పేట, కొత్తూరు, ఇందుకూరుపేట, జగదేవిపేట, తదితర గ్రామాల్లో 300ఎకరాల్లో అన్న దాతలు ఈ ఏడాది చేమ పంటను సాగుచేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో పంట దిగుబడి తగ్గింది. 5నుంచి 6 నెలల సాగుచేసే ఈ పంట ఎకరం సాగుకు సుమారు రూ.40 వేలు ఖర్చు అవుతుంది. పంటకోత తర్వాత 100 బస్తాలు (73కేజీల) వరకు దిగుబడి వచ్చేది. అయితే ఈ ఏడాది పంటకు కుళ్లు తెగులు సోకి దిగుబడి తగ్గినట్లుగా రైతులు వాపోతున్నారు. సరాసరిగా 60బస్తాలకు పంట దిగుబడి పడిపోయినట్లు చెబుతున్నారు.

● దళారుల మాయాజాలం

అసలే దిగుబడులు తగ్గి రైతులు బాధపడుతుంటే దళారులు మరింత నష్టాల్లోకి నెడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో చేమకు మంచి ధర పలుకుతోంది. అయితే దళారులు చేతివాటం ప్రదర్శిస్తూ రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. రవాణా ఇతర ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ఏం చేయలేక పంటను దళారులు చెప్పిన ధరలకే అమ్మేసుకుంటున్నారు. బస్తా రూ.1,100లకు పలుకుతుంది. ధర కాస్త పెంచితే కనీసం పెట్టుబడులు అయినా చేతి కందుతాయని చెబుతు న్నారు.

● దిగుబడి తగ్గింది

వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ ఏడాది చేమ పంట దిగుబడి తగ్గింది. కుళ్లు తెగులు సోకడంతో ఎకరాకు 60 నుంచి 70 బస్తాలు మాత్రమే చేమగడ్డలు ఉత్పత్తి అయ్యాయి. దీంతో రైతులకు నష్టాలు ఎదురయ్యాయి.

- కైలాసం శ్రీనివాసులురెడ్డి, కొత్తూరు

తగ్గిన కూరగాయల సాగు

● కోతులు, పశువుల బెడదే కారణం

● ఒకప్పుడు 100 ఎకరాలకుపైగా సాగు

● నేడు 20ఎకరాల లోపే..



చింతలపాళెంలో సాగులో ఉన్న వంకాయ మొక్కలు

వెంకటాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కసుమూరు, కనుపూరు గ్రామాల రైతులు వంకాయలు పంట సాగు చేసేవారు. వీటితో పాటు వంగ, దోశ, చిక్కుడు, బెండ, కాకర కూరగాయలతో పాటు గోంగూరతో పాటు ఇతర ఆకుకూరలను పండించే వారు. ముఖ్యంగా నీటి సౌకర్యం ఉన్న బోరు, బావుల ఆధారంగా సుమారు 100 ఎకరాలకుపైగా ఈ పంటల సాగు చేసేవారు. వాటిని నెల్లూరు నగరానికి తరలించి స్వ యంగా రైతులే అమ్ముకుని ఆర్థిక ఇబ్బందులు తీర్చుకునేవారు. నేడు ఆ పరస్థితి లేదు. పూర్తిగా తారుమారైంది. ఈ ప్రాంతంలో కూర గాయలు, ఆకుకూరల సాగు దాదాపుగా కనుమరుగైంది. ప్రస్తుత 20ఎకరాల సాగు చేయడం లేదు. ఇందుకు కారణం పంటలకు వచ్చే తెగుళ్లు, గిట్టుబాటు కాని ధరలతో ఈ సాగు చేయడం తగ్గించారు. దీనికితోడు కోతులు, పశువుల బెడద అధికంగా కావడం మరో కారణంగా చెప్పవచ్చు.

● కోతుల బెడద ఎక్కువైంది

- నలబాలపు వెంకటేశ్వర్లు, చింతలపాళెం

కూరగాయలు, ఆకుకూరల సాగు ఖర్చు గణనీయంగా పెరిగింది. పంటలకు చీడపీడలు పెరిగాయి. పురుగుమందుతో పాటు రసాయనిక ఎరు వులు, విత్తనాల ధరలు కూడా అనుహ్యంగా పెరిగిపోయాయి. పండిన అరకొర కూరగాయలు, ఆకుకూరలకు కోతులు, పశువులతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ సమస్యతో సాగు చేయడానికి ఇష్టపడడం లేదు.

హెచ్చరిక బోర్డులు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

తోటపల్లిగూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరు పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా సుమారు 22 లేఅవుట్లు నిర్వహిస్తున్నారని, గతంలో పనిచేసిన కార్యదర్శి వారికి నోటీసులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. వీటిని కొద్ది రోజులక్రితం రాత్రికి రాత్రి తొలగిస్తున్నారని అలాంటి వారిపై తగు చర్య లు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అలాగే రహదారి మార్గంలో మరో బ్రిక్స్ వ్యాపార సముదాయాల నుంచి వచ్చే దుమ్ముధూళితో తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ అధికారులు లేఅవుట్ దారులకు నోటీసులు ఇచ్చినా సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక సర్పంచ్ తెలిపారు.

టీడీపీలో చేరిన తాళ్లపూడి వైసీపీ నేతలు



సోమిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

ముత్తుకూరు, మే 10 (ఆంధ్రజ్యోతి):కాకాణిపై నమ్మకం సడలిపోవ డంతో వైసీపీ నేతల చూపు టీడీపీ వైపు మళ్లిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం తాళ్లపూడికి చెందిన కీలక వైసీపీ నేతలు వైసీపీ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట సుధీర్, జంగిట శీనయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు జంగిట సుధాకర్, కోట ఏడుకొండలు, జంగిట వెంకటేశ్వర్లు, షేక్.అల్లాబాషా, కోట సురేష్, మాజీ వాలంటీర్ కోట సాయి, పాకాల సురేష్‌లు టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి టీడీపీలోకి ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడారు. ఆరువారాలుగా దొంగల్లా దాక్కున్న గోవర్ధన్‌రెడ్డిపై వైసీపీ కేడర్లలో నమ్మకం తగ్గిపోయి టీడీపీలో చేరు తున్నట్లు తెలిపారు. మండలంలో తాళ్లపూడిలో వైసీపీ కంచుకోట బద్ధలైందన్నారు. ఒక్కొక్క రుగా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమవుతోందని, త్వరలో మరిన్ని కీలక చేరికలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహ న్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, సురేంద్ర పాల్గొన్నారు.

కొలిదిబ్బకాలనలో గడ్డివాము దగ్ధం



కాలిన గడ్డివామి వద్ద బాధితులు

తోటపల్లిగూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పేడూరు పంచాయతీ కొలిదిబ్బ గిరిజనకాలనీలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 10ఎకరాల గడ్డివామి దగ్ధమైనట్లు బాధితులు ఎం.బేటి రవి, సు మతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాలుగు పాడి గేదెలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని కష్టపడిన సొమ్మంతా పోగుచేసి 10ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి గడ్డివామి ఏర్పాటు చేసుకుంటే ఇలా అగ్నికి ఆహుతి అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులంతా చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపిస్తాయని నీటితో ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదంలో రూ.90వేలు నష్టం జరిగిందని, ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందిచాలని అధికా రులను వేడుకున్నారు. విషయం తెలుసుకున్న సీపీఎం మండల కార్య దర్శి ఈపూరు లక్ష్మయ్య, మారుబోయిన రాజా, మోచర్ల రాధయ్య, శేఖ ర్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కల్వర్టు లేక నిత్యం ప్రమాదాలు

తోటపల్లిగూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సాలిపేట కూడలిలో గత ఆరునెలల నుంచి పైపు లైన్ వేస్తూ కల్వర్టును కూల్చివే శారు. అయినా ఇప్పటివరకు సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. అంతే కాక ఆ ప్రదేశంలో ఎలాంటి సూచిక బోర్డులు పెట్టకపోవడంతో వాహన దారులకు నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలపరిధిలో సాలిపేట కూడలి ఈదూరు, వరకవిపూడి, అనంతపురం, కాటేపల్లి గ్రామాలకు వెళ్లడానికి ప్రధాన కేంద్రంగా ఉంది. ఈ ప్రాంతం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ రహదారిలో పలువురు వివిధ పరి శ్రమల్లో పనులకు వాహనాలపై వెళుతుంటారు. కల్వర్టు లేక రహదారి కనపడకపోవడంతో ఇటీవల ఓ కుటుంబం ప్రమాదానికి గురైంది. కొద్దిరోజుల క్రితం మరో ట్రాక్టరు కూడా బోల్తా పడింది. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపటాలని ప్రజలు కోరుతున్నారు.



సాలిపేటలో పైపులైన్ వేస్తూ కూల్చిన కల్వర్టు

C.R.I.M.E N.E.W.S

కరెంటు తీగలు తగిలి యువకుడి మృతి



చిలకా సాయితేజ

బుచ్చిరెడ్డిపాళెం,మే 10 (ఆంధ్రజ్యోతి) బుచ్చిలోని బజాజ్ షోరూం వెనుక ప్రాంతంలో శనివారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై సాయితేజ (17) అనే యువకుడు మృతి చెందాడు. కాశీపాళెంకు చెందిన చిలకా బిందుకు ఇద్దరు కుమారులు. భర్త భానుచందర్ మృతితో కొడుకుల సంరక్షణ భారం ఈమెపైనే పడింది. నిరుపేద కుటుంబం కావడంతో పెద్ద కుమారుడు భాస్కర్‌ను మాత్రమే చదివిస్తోంది. చిన్నకుమారుడు సాయితేజ పనులకు వెళుతుంటాడు. శనివారం సాయంత్రం ఇసుక కమ్మీతో చెత్తను తొలగిస్తూ ఆ కమ్మీ పైకి ఎత్తడంతో చేతికందే ఎత్తులో వున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించే కొడుకు మరణించడంతో ఆ కుటుంబం వీధిన పడ్డట్టు అయ్యింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంతోష్ రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. తీర్థయాత్రలకు వెళ్లిన తల్లి బిందు విషయం తెలియడంతో అన్నవరం నుంచి వెనుదిరిగింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చేపల కోసం వెళ్లి శవమై తేలాడు!

● యాచవరంలో రైతు మృతి

మనుబోలు, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాచవరం గ్రామంలో రాపూరు వీరాస్వామి (55)అనే రైతు శనివారం కండలేరు కాలువలో శవమై కనిపించాడు. స్థానికుల కథనం మేరకు... వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే ఈయన వీలు దొరికనప్పుడల్లా తన పొలాల పక్కనే ఉన్న కండలేరు కాలువలో చేపలు పడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం చేపల కోసమని వెళ్లాడు. రాత్రి ఎంతకీ రాకపోవడంతో కుటుంబీకులతో కలిసి స్థానికులు గాలించారు. ఆచూకీ తెలియక పోవడంతో ఆందోళన పడ్డారు. శనివారం వేకువ జామున కాలువ సమీపంలో అటుగా వెళుతున్న వారికి కాలువలో కూరుకుపోయి ఉన్న వీరాస్వామిని గుర్తించి బంధువులకు తెలిపారు. గ్రామస్థులు, యువకులు వెళ్లి అతన్ని బయటకు తీశారు. చేపల కోసమని దిగితే నీటిలో పాము కరిచిందో, గుంతల్లో కాలుజారి కూరుకుపోయాడో, శరీరంపై అక్కడక్కడ స్వల్పగాయాలు ఉండడంతో కొట్టి పడేశారో తెలియడం లేదని బంధువులు రోదించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

65 ఎకరాల గడ్డివాముల దగ్ధం

● సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం



ఎగిసిపడుతున్న మంటలు

అల్లూరు, మే 10(ఆంధ్ర జ్యోతి):మండలంలోని సింగ పేట మజరా మూర్తిరాజపు రంలో నాలుగు గడ్డివాము లు దగ్ధమైన సంఘటన శు క్రవారం అర్ధరాత్రి జరిగింది. బాధితులు కథనం మేరకు... రైతులు తలపల శీనయ్య, త లపల ప్రసాద్‌లకు చెందిన 20 ఎకరాల రెండు గడ్డివాములు, మల్లి కళావతికి చెందిన 30ఎకరముల గడ్డివామి, రాచగిరి వెంకట రవ ణయ్యకు చెందిన 15ఎకరాల గడ్డి వాములు ఒకేదఫా దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా అర్ధరాత్రి మంటలు ఎగసి పడుతుండడాన్ని గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా అదుపులోకి రాకపోవడంతో అక్కడే ఉన్న ఎక్స్‌కవేటర్‌తో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. సమాచారం అందుకున్న కావలి, నెల్లూరులకు చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనతో రైతులకు దాదాపు రూ.3లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టి ఉంటారని, లేకుంటే ఒక చోట ఉన్న రెండు గడ్డివాములతో పాటు దూరంగా ఉన్న మరో రెండు గడ్డివాములు ఒకేసారి అగ్నికి ఆహుతవ్వడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘట నపై అల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కావలి సీఐ పాపా రావు, ఎస్ఐ కిషోర్‌బాబులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు పాల్పడిన వారిపై చర్య తీసుకుంటామని తెలిపారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

వెంకటాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి): గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలోని ఆర్టీసీ జోనల్ కళాశాల ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తాపడి నలుగురు గాయపడ్డారు. నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న ఆటో మలుపు వద్ద ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా..ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అలాగే ఆటో ముందుభాగం కూడా దెబ్బతింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్య కేసు నిందితుడి అరెస్టు

వెంకటాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి):కట్టుకున్న భార్యను మచ్చు కత్తితో గొంతుకోసి హత్యచేసిన కేసులో పొదలకూరు మండలంలోని వామిటిపర్తికి చెందిన పచ్చిపాల బాబును పోలీసులు అరెస్టు చేశారు. వెంకటాచలం మండలం చవటపాళెం పంచాయతీ అబ్బిసాహెబ్‌కండ్రిగ గ్రామంలో ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి భారతిని ఆమె భర్త బాబు గొంతుకోసి హత్య చేసిన విషయం తెలిసిందే. అరెస్టు చేసిన ఇతన్ని శనివారం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు పచ్చిపాల బాబుకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

రేషన్ బియ్యం పట్టివేత

వెంకటాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి):చవటపాళెం క్రాస్‌రోడ్డులోని జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం విజిలెన్స్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి నెల్లూరు వైపుగా వెళ్తున్న పాల వాహ నాన్ని నిలిపి క్షుణ్ణంగా పరిశీలించగా 54బస్తాల బియ్యాన్ని గుర్తిం చారు. పాల వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులో కి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



కావలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి):ఉగ్రదాడు లు, రైళ్లలో చోరీలను దృష్టి లో పెట్టుకుని కావలి రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. 1వ పట్టణ సీఐ ఫిరోజ్, 1వ పట్టణ, జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్ఐలు సుమన్, మాలకొండయ్య, సుబ్బారావులు సిబ్బందితో కలిసి స్టేషన్ పరిసరాలతో పాటు ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పలు రైళ్లలో కూడా తనిఖీలు నిర్వహించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	140
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	276

కోడిగుడ్ల ధర (100) : 500

మూలస్థానేశ్వరుడికి చిన్న నందివాహన సేవ

నెల్లూరు (సాంస్కృతికం) మే 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు జరిగాయి. అనంతరం నందీశ్వరస్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే మూలస్థానేశ్వరస్వామికి అభి షేకాలు, పంచామృతాభిషేకాలు, అలంకారం, పూజలు జరిగాయి. వసంతోత్సవాలలో భాగంగా కైలాససేవ అలంకారం కనుల పండు వగా జరిగింది. ఈ సందర్భంగా శివపార్వ తిలకు చిన్న వెండినంది వాహనంపై ప్రాకా రోత్సవం జరిగింది. స్వామిని భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



జిల్లా కోర్టు ప్రాంగణానికి మహర్దశ

- చెత్తాచెదారం, చెట్ల మొదళ్ల తొలగింపు
- ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం
- తెరుచుకున్న రెండవ గేటు
- జిల్లా ప్రధాన న్యాయాధికారి చొరవతోనే..

నెల్లూరు (లీగల్), మే 10 (ఆంధ్ర జ్యోతి): ఎట్టకేలకు జిల్లా కోర్టు ప్రాంగణానికి మహర్దశ పట్టింది. జిల్లా ప్రధాన న్యాయా ధికారిగా జీ. శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టాక కోర్టు ప్రాంగణ స్వరూపమే మారిపోయింది. ఎన్నోఏళ్లుగా పేరుకు పోయిన చెత్తను ఆయన క్షణాల్లో తీయించేశారు. అలాగే ట్రాఫిక్ సమస్య ఎప్పటి నుంచే ఉంది. పదేళ్ల క్రితం కోర్టు ప్రాంగణంలో కుక్కర్ బాంబు పేలింది. ఆ సమయంలో కోర్టు ప్రాంగణంలో ఉన్న రెండోగేటు మూసి వేశారు. అప్పటి నుంచి దాన్ని తెరవ లేదు. కోర్టులో చెట్లు కూలిపోతే వాటి మొద్దులు అలాగే ఉండిపోయాయి. ఈ సమస్యలన్నింటిపై ప్రధాన న్యాయాధికారి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని



వృథా సామగ్రిని తరలిస్తున్న వాహనం

పరిష్కరించారు. తొలుత రెండో గేటు తెరిచారు. కోర్టు ప్రాంగణ మంతా కూడా చెట్లపొద లతో ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా చదును చేయించారు. చెట్ల మొద్దు లను కూడా తొలగింపచేశారు. దీంతో కోర్టు ప్రాంగణం నేడు చూడటానికి ఎంతో సుందరంగా మారింది. అలాగే కోర్టు ప్రాంగణానికి నిత్యం వంద లాది వాహనాలు వస్తూ పోతుంటాయి. వీటిలో కొన్ని మాత్రమే న్యాయవాదులు, కక్షి దారులవి. మిగతావి బయట వ్యక్తులవి. వారంతా కోర్టు పనిలేకున్నా ప్రాంగణంలో పార్కింగ్ చేసి వెళుతుంటారు. అలాగే కోర్టు ప్రాంగణంలో ప్రైవేటు సెటిల్‌మెంట్లు చేసే వారు వస్తూ పోతుంటారు. కోర్టు ప్రాంగణంలో గార్డు డ్యూటీలో ఉన్నా, పోలీసు వారు ఏ రోజైనవచ్చి వారిని తనిఖీ చేసిన ఆనవాళ్లు లేవు. గతంలో కోర్టు ప్రాంగణంలోనే అనేక కొట్లాటలు జరిగాయి. పలు క్రిమినల్ కేసుల్లో కక్షిదారులను జైళ్ల నుంచి ఇక్కడికి తీసుకు వస్తుంటారు. సరైన భద్రతా ఏర్పాట్లు లేనందువల్లే పదేళ్ల క్రితం జైలుకు పోయే దారిలో అగంతకులు



చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్న ఎక్స్‌కవేటర్



తెరుచుకున్న కోర్టు రెండవ గేటు

పెట్టిన కుక్కర్‌బాంబు పేలింది. అయితే అ సమయంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. గతంలో కూడా ఒంగోలు నుంచి జైలుకు కక్షిదారుడిని తీసుకు వస్తుంటే, జైలు బయట నాటు బాంబులు వేసి, అతడ్ని చంపేశారు. ఇకముందు ఇలా జరగకుండా చర్యలు చేపట్టారు.

● బందోబస్తు ఏర్పాటు చేయాలి

కాగా జిల్లా జైలు కూడా గతంలో కోర్టు కోర్టు ప్రాంగణానికి అనుకునే ఉండేది. జిల్లా కోర్టు ప్రాంగణంలోనే నాల్గవ అదనపు జ్యూడిషియల్ మేజి స్ట్రేట్‌వారి కోర్టులో గతంలో ఓ మంత్రికి సంబంధించిన క్రిమినల్ కేసు ఫైల్ చోరీకి గురైంది.



శుభ్రంగా కనిపిస్తున్న కోర్టు ప్రాంగణం

ఇకపోతే బయట వ్యక్తులు వస్తూ పోతూ ఉంటారు. కొన్నిసార్లు గొడవలకు దిగుతుం టారు. కాబట్టి ఇక్కడ సరైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తే ఇలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగ కుండా ఉం టాయని పలువురు న్యాయవాదులు, కక్షిదారులు అంటున్నారు.

వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కే. శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో టీపీ గూడూరు, బుచ్చి, బాలాజీనగర్ ఎస్‌ఐగా, కావలి సీఐగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్ప గుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఎస్పీ జీ. కృష్ణకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 10 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో వేములపాటి అనంత రామయ్య, కామేశ్వరి దంపతుల జ్ఞాప కార్థం జనసేన ఆధ్వర్యంలో శనివారం డొక్కా సీతమ్మ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరామయ్య మనవడు, న్యాయవాది శరత్ దీన్ని ప్రారంభించారు. జనసేన నాయకులు జమీర్, సుందర్ రామిరెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్, సుధా మాదవ్, పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), మే 10 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ చేశారు. అతిథిగా డీఎస్పీ కోటారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోబోలు సత్యనారాయణ, కార్యదర్శి స్నేహ సురేష్, మాజీ అధ్యక్షులు వేలూరు రంగారావు, దాసరి అనంతరామారావు, నలుబోలు బలరామయ్యనాయుడు, బాసం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కో స్థలాన్ని చేనేతలకు అప్పగించాలి

నెల్లూరు (వైద్యం) మే 10 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని గాంధీ నగర్‌లోని సర్వే నెంబర్ 10/3లో ఉన్న 6.90 ఎకరాల ఆప్కో స్థలాన్ని చేనేతకు అప్పగించాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారా యణరెడ్డిని ఏపీ చేనేత కార్మిక సంఘం నేతలు కోరారు. శనివారం ఈ మేరకు వారు మంత్రికి వినతిపత్రం అంద చేశారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఆప్కో స్థలంలో ఉన్న షెడ్లను చట్టవిరుద్ధంగా కూల్చి వేసిందన్నారు. ఈ స్థలాన్ని వేరే వారికి కేటాయించారని పేర్కొన్నారు. ఆ స్థలాన్ని తిరిగి హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్ కార్యాలయానికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల కల్పనకు వినతి

నెల్లూరు (హరనాథపురం) మే 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థలోనూ, వైద్య, ఆరోగ్యశాఖ లోనూ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయ వార్డ్ అడ్మిన్లకు సీనియర్ అసిస్టెంట్ స్థాయిలో వార్డు ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పించాలని ఏపీ రాష్ట్ర వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లంపూడి సతీష్‌రెడ్డి, కార్యదర్శి ఎం.బాలరాజు కూడా వినతిపత్రం సమర్పించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ



మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేసిన ఉద్యోగ సంఘం నాయకులు

అధికారులతో చర్చించి పదోన్నతులకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ హంస గౌరవ సలహాదారులు అరవ పరిమళ, జిల్లా నాయకులు హరిప్రసాద్, వెంకటేష్, అశోక్, విజయలక్ష్మి, బ్రహ్మేశ్వరి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



రంజనా నీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూనియన్ నేతలు

రంజనా నీరులకు నివాళి

నెల్లూరు (వైద్యం) మే 10 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఆశావర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకురాలు రంజనా నీరుల వర్ధంతిని శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూని యన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం రం జనా పోరాడారన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి మధుసూదన, పెంచలమ్మ, సరిత, ఉష, మాధవి పాల్గొన్నారు.

20న సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ

నెల్లూరు (వైద్యం) మే 10 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. శనివారం ఏసీ మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హమాలీ వర్కర్స్ విశ్రాంతిగదిలో జనరల్ బాడీ సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాన్ని, బీజేపీ ప్రభుత్వం నాలుగు చట్టాలుగా మార్చిందన్నారు. కార్మికులు హక్కులను కాలరాస్తుందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా చేపడుతున్న సమ్మెలో కార్మికులంతా పాల్గొనా లన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు పెంచలనరసయ్య, మాదాల వెంకటేశ్వర్లు, కొండాప్రసాద్, అంజిరెడ్డి, నాగిరెడ్డి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులరెడ్డి, నారాయణ, రఘు పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథుడికి రావణసేవ

నెల్లూరు (సాంస్కృతికం) మే 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉస్మాన్ సాహెబ్‌పేట అన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథస్వామికి శనివారం ఉదయం హోమాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూలంగిసేవ, విశేష పూజలు, పుష్పాలంకారం నిర్వహించారు. అనంతరం రావణసేవ అలంకారంలో పేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా శ్రీరాజరాజేశ్వరి రైస్ ఇండస్ట్రీ అధినతలు కొలపర్తి రమేష్‌కుమార్, సువర్ణలక్ష్మి వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో పత్తి జయరామయ్యనాయుడు, మోదెం మల్లికార్జున రావు, ఆడిటర్ రాఘవేంద్రరావు, మాజీ ఛైర్మన్‌లు, ఈవో జీ.దర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఉస్మాన్ సాహెబ్‌పేట అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేరుడికి నిర్వహించిన రావణసేవ

ఎన్జీవో నగర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ హజరత్‌రెడ్డి



నెల్లూరు రూరల్, మే 10,(ఆంధ్రజ్యోతి) : ఎన్జీవో నగర ఉపాధ్యక్షుడిగా అల్లీపురం పీహెచ్‌సీ డాక్టర్ కొల్లి హజరత్‌రెడ్డి నియమితుల య్యారు. శనివారం నగరంలోని ఎన్జీవో హోంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సంయుక్త కార్యదర్శి కే జనార్దన్‌రాజును ఎన్నికయ్యారని పరిశీలకుడు ఆంజనేయవర్మ తెలియచేశారని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు హజరత్‌రెడ్డి తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు ఆటల పోటీలు

నెల్లూరు(సిటీ), మే 10,(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీనగర్ పాఠశాల వద్ద శనివారం పారి శుధ్య కార్మికులకు ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు మేయర్ స్రవంతి బహుమతులు అందచేశారు. ముందుగా వారితో కలిసి ఆమె పలు ఆటల్లో పాల్గొన్నారు. ఇలాంటి పోటీలు వ్య క్తుల మధ్య తత్సంబంధాలను దగ్గర చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయానికి ఉడిపి స్వామీజీ రాక

నెల్లూరు (సాంస్కృతికం) మే 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి శనివారం రాత్రి ఉడిపి శ్రీకృష్ణ పీఠాధిపతి ఈశ్వ ప్రియ తీర్థ స్వామీజీ విచ్చేశారు. ఆయన ముందుగా అమ్మవారికి, సుందరేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. భక్తులకు మం గళ శాసనాలు అందించారు. స్వామీజీకి ఆలయ ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు.



నగరంలో హీరోయిన్ అనన్య సందడి

నెల్లూరు (సాంస్కృతికం) మే 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో సినీ హీరోయిన్ అనన్య నాగెళ్ల శనివారం సందడి చేశారు. 'హాయ్ నెల్లూరు'.. అంటూ అభిమానులను పలకరించారు. నగరంలో ఓ వ్యాపార దుకాణాన్ని ప్రారంభించేందుకు ఆమె ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం తాను 5 సినిమాలకు పనిచేస్తున్నానని తెలిపారు. హీరో పవన్‌కళ్యాణ్ అంటే ఇష్టమన్నారు. నెల్లూరులో చేపల పులుసు ఫేమస్ అయినా, తనకు నెల్లూరు స్వీట్స్ అంటే ఇష్టమని చెప్పారు.

హెచ్చరిక నోటీసు

నా క్లయింట్ అయిన శ్రీమతి సన్నపరెడ్డి కమల W/o. శ్రీ ముమ్మారెడ్డి శ్రీనివాస్, D.No. 08-02-545, flat No.G 407, Brigade at No.07, Banjara Hills, Hyderabad, Telangana State-500034. నివాసములో ఉంటూ, **యావత్ ప్రజానీకానికి తెలియజేయడమేమనగా:-**

లోగడ **ఊటుకూరు గ్రామం, విడవలూరు మండలం, S.P.S.** నెల్లూరు జిల్లా, Sy.No. 930/3 నందు 13 ఎకరాల 69.1/2 సెంట్లను తేదీ:09-12-1987న నేను, శ్రీ యస్.చంద్రశేఖర్‌రెడ్డి **ఇద్దరమూ కలసి** కొండూరు చంద్రశేఖర్‌రెడ్డి గారి వద్ద, **జాయింటుగా** కొనుగోలు చేసి, అటు తరువాత నేను బిరదవోలు వెంకురెడ్డి గారి వద్ద, Sy.No. 930/3 నందు 13 ఎకరాల 69.1/2 సెంట్లను తేదీ:27-10-198గా కొనుగోలు చేసి, రిజిష్టర్ **డాక్యుమెంట్స్ నంబర్స్ వరుసగా 1261/1987గా, మరియు 767/1989గా ఈ రోజు వరకూ నేను నా భాగానికి సంబంధించిన పొలమును పూర్తి హక్కులతో సాగుబడి చేసుకుంటున్నాను**

[Schedule No-1] [Schedule No-2] కొనుగోలు చేసిన పిదప ప్రభుత్వ విధి విధానాల ప్రకారం మా హక్కు భుక్తములో, మా సాగుబడిలో వున్నవిగా అధికారిక రికార్డ్స్ నందు నమోదు కాబడి వున్నవి. అయితే ఈ సంవత్సరం ఫిబ్రవరి నెల నందు **1) ఇందుపూరు దివర్ణ లక్ష్మి W/o. ఇందుపూరు దామోదర్‌రెడ్డి, 2) ఇందుపూరు దామోదర్‌రెడ్డి S/o. కృష్ణారెడ్డి** అనువారలు, నాకు తెలియకుండా, నేను వ్రాసినట్లు రెండు **మోసపూరితమైన అగ్రిమెంట్లను తేదీ: 26-08-1989న** ఒక అగ్రిమెంట్‌ను మరియు **తేదీ: 10-09-1991న** మరొక అగ్రిమెంట్‌ను సృష్టించి సదరు రెండు అగ్రిమెంట్ల నందు, పై **షెడ్యూల్డ్ ఆస్తి 1 మరియు షెడ్యూల్డ్ ఆస్తి-2ని** నేను నా భాగానికి సంబంధించిన పొలమును పూర్తి హక్కులతో, 26-08-1989 మరియు 10-09-1991 తేదీలలో వారికి చెందజేసి, సదరు పైన పేర్కొనబడిన వ్యక్తులకు అమ్మినట్లు, సదరు భూమిని వారికి, ఈ రోజు వరకూ వారి పేరు మీద నేను రిజిస్ట్రేషన్ చేయలేదని పేర్కొని, గౌరవ **Principal Junior Civil Judge కోవూరు న్యాయస్థానం నందు O.S.No- 388/2024, O.S.No.387/2024 గా రెండు కేసులు వేయుట జరిగినది.** ప్రస్తుతం సదరు రెండు కేసులకు సంబంధించి విచారణ ప్రారంభ దశలో వున్నది.

పై విధానము జరుగుతూవుండగా, ఇందుపూరు కృష్ణ నిర్దేష్ S/o. ఇందుపూరు దామోదర్‌రెడ్డి అనువ్యక్తి, RSR SEA FOODS JAGADEESH NAGAR NELLORE Represented by **ఆర్.సాత్విక** W/o.ఇందుపూరు కృష్ణ నిర్దేష్ మరియు MAHA VIGHNESH AQUA FIRMS CHENNAI Represented by **గీతాకృష్ణ** అనువారలకు రొయ్యల సాగు చేసుకొనుటకు, పైన పేర్కొన్న రెండు షెడ్యూల్డ్ ఆస్తిని **నేను** సదరు **ఇందుపూరు కృష్ణ నిర్దేష్‌తో కలసి** సాగుకు ఇచ్చినట్లు **తేదీ:20-02-2023న,** నా నమ్మతితో, నా సంతకముతో, కూడిన ఒక అగ్రిమెంట్ తయారు చేసి సదరు అగ్రిమెంట్ ప్రకారం పైన తెలిపిన కంపెనీల వారు ఆక్వా సాగు చేస్తున్నారుగా నాకు తెలియవచ్చింది. సదరు విషయం **ఆర్.సాత్విక W/o. ఇందుపూరు కృష్ణ నిర్దేష్ మరియు గీతాకృష్ణలను** వివరణ తీసుకునే ప్రయత్నం చేయగా వారు నాకు **అందుబాటులోనికి రాక** తప్పించుకు తిరుగుతున్నారు. పై విషయం బయటపడేసరికి, పై కంపెనీ ప్రతినిధులతో సదరు **అగ్రిమెంట్ రద్దు పరచుకుని,** ప్రస్తుతం కావలి వద్ద చాకిచర్ల గ్రామస్థుడు **సాయి గణేష్ ఆక్వా ఫీడ్స్ ప్రొప్రయిటర్ తిరుపతి** మరియు అతని అనుచరులకు సదరు **కృష్ణ నిర్దేష్** భూమితో బాటు **నా రెండు షెడ్యూల్డ్ ఆస్తిని, సదరు కృష్ణ నిర్దేష్ తన ఆస్తిగా చూపి** ఆక్వా లీజుకు ఇవ్వజూపుతున్నారని విచారణలో తేలింది.

ఈ పేపరు ప్రకటన నందు పేర్కొన్న **(1) ఇందుపూరు దివర్ణ లక్ష్మి (2) ఇందుపూరు దామోదర్‌రెడ్డి (3) ఆర్.సాత్విక** మరియు **(4)** MAHA VIGHNESH AQUA FIRMS CHENNAI Represented by **గీత కృష్ణ** అను వ్యక్తులకు నా రెండు షెడ్యూల్డ్‌ల ఆస్తికి ఏ మాత్రం సంబంధము లేదని, నేను గతంలో గానీ, ఇప్పుడు గానీ, పై వ్యక్తులకు గానీ, ఇతర ప్రయివేటు వ్యక్తులకు గానీ **కృష్ణ నిర్దేష్‌తో కలసి ఎలాంటి అగ్రిమెంట్స్ చేయలేదని,** సదరు అగ్రిమెంట్స్ నందు **చేసిన సంతకాలు నావి కావని,** అగ్రిమెంట్స్ నందు పేర్కొన్న కంపెనీ ప్రతినిధులెవరూ, నాతో పై విషయం సంప్రదించపులు జరపలేదని, కావున **ఈ పేపరు ప్రకటన వెలువడిన తేదీ నుండి మరియు భవిష్యత్తులో** పైన పేర్కొన్న వ్యక్తులు మరియు కంపెనీ ప్రతినిధులు నా రెండు షెడ్యూల్డ్ ఆస్తిపై **ఎటువంటి లావాదేవీలు నాకు తెలియకుండా జరపరాదని,** ఇప్పటికే ఒక వేళ పైన పేర్కొన్న వ్యక్తుల **మోసపూరిత మాటలు నమ్మి** ఎవరైనా, నా రెండు షెడ్యూల్డ్‌ల ఆస్తిని అగ్రిమెంట్స్ చేసుకుని ఉంటే, **సదరు అగ్రిమెంట్స్ ఎంతమాత్రమూ చెల్లవని, సదరు లావాదేవీలు నాకు బద్ధగించవని,** కావున సదరు ఈ పేపరు ప్రకటనలో పేర్కొన్న వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలియజేస్తున్నాను. ఇప్పటికే **గౌరవ** Principal Junior Civil Judge కోవూరు న్యాయస్థానం నందు **O.S. No. 387/2024** మరియు **O.S. No. 388/2024** వివాదము ప్రారంభ దశలో వున్నదని **ఎటువంటి స్టే ఆర్డర్స్ లేవని,** కావున ఎవరైనా సదరు పైన వ్యక్తులతో కలసి నా రెండు షెడ్యూల్డ్‌ల ఆస్తులతో **ఎటువంటి లావాదేవీలు జరపరాదని తెలియజేస్తున్నాను.**

ప్రభుత్వ విధానపరంగా **ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే నందు** కూడా పైన పేర్కొన్న వ్యక్తులు సంబంధిత అధికారులను **తప్పు దోవ పట్టించి హద్దులు మార్చేసి,** వారికి ఏ మాత్రమే సంబంధము లేని నా రెండు షెడ్యూల్డ్ ఆస్తులను వారి ఆస్తులుగా ప్రభుత్వ రికార్డ్స్ నందు నమోదు కావించు ప్రయత్నము చేయుచున్నారని దీనికి కొంతమంది అధికారులు సదరు వ్యక్తులకు సహకారం అందిస్తున్నారని తెలియవచ్చినది. కావున సదరు **సంబంధిత అధికారులు ఎవ్వరూ వీరి మోసపూరితమైన మాటలు నమ్మకుండా,** మీరు రీ సర్వే కార్యక్రమం నందు **సమర్పించే డాక్యుమెంట్స్‌ను పూర్తి క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే ప్రభుత్వ రికార్డ్స్ నందు నమోదు చేయగలరని అధికారులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.** ఒక వేళ ఈ పేపరు ప్రకటనను పట్టించుకొనక ఎవరైనా వ్యక్తులు మరియు కంపెనీ ప్రతినిధులు **నా రెండు షెడ్యూల్డ్ ఆస్తులకు** సంబంధించి సదరు పైన తెలిపిన వ్యక్తులతో కలిసి **ఏవైనా అగ్రిమెంట్స్ మరియు అగ్రిమెంట్స్ లేకుండా లావాదేవీలు జరిపినా, మరియు నా అనుమతి లేకుండా** పై రెండు షెడ్యూల్డ్‌ల ఆస్తి నందు, అక్రమంగా **ప్రవేశించి రాకపోకలు జరిపినా, పొలము నందలి కరెంటు వైర్లు మరియు సప్లైలు అనధికారికముగా వాడినా, ఎటువంటి నీటి సదుపాయములు తీసుకున్నా, జరగబోవు నష్టములకు, నేను తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు పూర్తి బాధ్యులు కాగలరని, హెచ్చరిస్తున్నాను.**

Schedule..No-1:- Regd sale deed 1261/1987, SRO Alluru S.P,S.Nellore District dated 09-12-1987 Utukur Village, Vidavalur (M) Sy..No..930/3 నందు **13 ఎకరాల 69.1/2 సెంట్లు. East:-** I. వెంకట రమణారెడ్డి భూమి, **South:-** Sy No-1402 Dry Land, **West:-** B.C. Canal, **North:-**Sy No.930/3 మిగులు భూమి.

Schedule..No-2:- Regd sale deed 767/1989, SRO Alluru S.P,S.Nellore District dated 27-10-1989 Utukur Village, Vidavalur (M) Sy..No..930/3 నందు **13 ఎకరాల 69.1/2 సెంట్లు. East:-** Sy.No-1377/18 భూమి, **South:-** Sy. No.930/3 మిగులు భూమి, **West:-** B.C.Canal, **North:-** Sy.No-1370,1371, 928 భూమి

Counter Singned by
సన్నపరెడ్డి కమల
భర్త ముమ్మారెడ్డి శ్రీనివాస్, హైదరాబాద్

V.V.S.C. మురళీధర్‌రావు, B.A., L.L.B.,
Advocate, A.P.High Court
Cell No.9866905975

అమ్మ దిద్దిన ఐఏఎస్‌లు



అమ్మకి మరోపేరే త్యాగం. ఓర్పు, నేర్పు.. అమ్మదనంతో అలవోకగా అలవడే లక్షణాలు. బిడ్డల కోసం జీవితంతో పోరాడే ధీశాలి. భూదేవితో తప్ప అమ్మను మరిక దేనితోనూ పోల్చలేం. అందుకే.. 'తానుండలేని తావులో తనకు బదులుగా దేవుడు అమ్మని సృష్టించాడు' అని చెబుతారు. కని, పెంచిన కష్టం మాత్రమే కాదు.. బిడ్డల బంగారు భవిష్యత్తుకూ అమ్మ రూపశిల్పి. అమ్మ పట్టుదలకూ, ప్రేమకూ, అమ్మకన్న కలలకూ ప్రతిరూపాలే పిల్లలు. అమ్మ తీర్చిదిద్దిన ఈ బిడ్డలు ఐఏఎస్‌లు అయ్యారు. వెంకటేశ్వర్.. తిరుపతి జిల్లాకు పరిపాలనా సారథ్యం వహిస్తున్నారు. మౌర్య తిరుపతి నగర పాలన బాధ్యతల్లో ఉన్నారు. వీరిద్దరు అమ్మల గురించి ఆంధ్రజ్యోతితో పంచుకున్న సంగతులు.. వారి మాటల్లోనే..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఆమె కష్టాలూ, త్యాగాలూ వెలకట్టలేను!

మాది పెద్ద కుటుంబం. ఐదుగురు పిల్లలం. ఒక అన్న, ముగ్గురు అక్కల తర్వాత నేను. అంతమందిని చదివించి పెంచి పెద్ద చేయడం అంటే మాటలు కాదు. అమ్మ ఉద్యోగం వదులుకుని వచ్చేశాక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాం. వాటి తీవ్రత, అమ్మ పడిన కష్టాల గురించి అంతకుమించి చెప్పలేను. మా కోసం తను పడిన కష్టాలు, చేసిన త్యాగాలకు వెలకట్టలేను.



అమ్మ కల ఇది!

● కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

మాకోసం కెరీర్‌నే వదులుకున్నారు!

మా కోసం అమ్మ తన ఉద్యోగాన్ని, కెరీర్‌ను పూర్తిగా వదులుకున్నారు. నేను హైస్కూలు చదువు స్థాయికి వచ్చేసరికి ఎదిగే వయసులో పిల్లలతో గడపాలని, మా మంచి చెడ్డలు చూడాలని సౌదీ అరేబియాలో ఉద్యోగం వదిలిపెట్టేసి వచ్చేశారు. నిజానికి సౌదీలో ఇరవై ఏళ్ల అనుభవం ఉన్నందున ఇక్కడికి వచ్చాక సిటీల్లో ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో అయినా మంచి ఉద్యోగంలో చేరే అవకాశం ఉండింది. కేవలం మా కోసమే అమ్మ అలాంటి ప్రయత్నం చేయలేదు. మాతోనే ఉండిపోయి తన కెరీర్‌నే పూర్తిగా వదులుకున్నారు.

అమ్మ కల.. నా ఐఏఎస్

నేను చిన్నప్పటి నుంచీ చదువులో చురుకుగా ఉండేవాడిని. అది గమనించిన అమ్మ.. నువ్వు ఐఏఎస్ చేయాలి అనేది. అది చిన్నపుడే నాలో నాటుకుంది. అమ్మకి ఆ కోరిక ఎందుకు కలిగిందంటే.. 2001లో మా సొంత మండలం కొమరోలు (ప్రకాశం జిల్లా) జడ్పీటీసీ స్థానం బీసీ మహిళలకు రిజర్వు అయింది. బీసీ జనరల్ అయివుంటే నాన్న వెంకటయ్య పోటీ చేసివుండేవారు. మహిళకు రిజర్వు కావడంతో అమ్మ పోటీ చేసి జడ్పీటీసీగా గెలిచారు. నాన్న కూడా సర్పంచుగా, జడ్పీటీసీగా పనిచేశారు. ప్రజాప్రతినిధులు కావడం వల్ల వారికి కలెక్టర్ వంటి ఐఏఎస్ అధికారులను కలిసే అవకాశం ఉండేది. దాంతో నన్ను ఐఏఎస్ ఆఫీసర్‌గా చూడాలన్న ఆశ, పట్టుదల అమ్మకు ఇంకా ఎక్కువైంది. ప్రతి సందర్భంలోనూ ఆ విషయాన్ని గుర్తు చేస్తూ ఉండేవారు. అందుకే మెడిసిన్ పూర్తి చేసినప్పటికీ డాక్టర్‌గా కొనసాగకుండా కేవలం అమ్మకోసమే సివిల్స్ వైపు దృష్టి మళ్లించా. తొలి రెండు ప్రయత్నాలలో ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికైనా అమ్మ కోసమే పట్టుదలగా ప్రయత్నించి మూడవసారి ఐఏఎస్ సాధించా. ఆ క్షణం అమ్మ పడిన సంబరం, సంతోషం వర్ణించలేను. తనే ఐఏఎస్ సాధించినట్టు ఫీలయ్యారు. ట్రైనీ కలెక్టర్‌గా విధుల్లో చేరిన రోజు నా కుర్చీలో కూర్చోబెట్టినపుడు అమ్మ కళ్లలోని ఆ మెరుపులు చాలు నా జీవితానికి అనిపించింది. అలాగే రిపబ్లిక్ డే ఉత్సవాలలో రాష్ట్రపతి ప్రతినిధిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం, పోలీసు గౌరవ వందనం స్వీకరించడం వంటి సందర్భాలు ప్రత్యక్షంగా చూసిన అమ్మ గర్వపడిన క్షణాలను ఎప్పటికీ మరచిపోలేను. పిల్లల కోసం ఇన్ని త్యాగాలు చేసిన అమ్మకు సంతోషం కలిగించడం తప్ప ఇంకేం ఇవ్వగలం.. అమ్మ రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది.. ఏ బిడ్డలకైనా!

అమ్మ పట్టుదల

● తిరుపతి నగర కమిషనర్ మౌర్య



నా విజయంలో సగం ఆమెదే

అమ్మ జయశ్రీ పెద్దచదవరి కాదు. మాది కడప జిల్లా ప్రొద్దుటూరు సమీపంలోని నాగులపల్లి. పల్లెలో పుట్టి పెరిగిన అమ్మ.. బిడ్డల కోసం పెద్ద కలలు కనింది. ఆ కలలు నెరవేరడానికి కొండలా నిలబడింది. నా ఐఏఎస్ సాధనయాత్రలో అమ్మ కష్టం.. అమ్మ త్యాగం గురించి ఎంత చెప్పినా తక్కువే! నాకు అమ్మంటే ఇష్టం. అమ్మకు చదవంటే ఇష్టం. అమ్మ కళ్లలో మెరుపుకోసం మరింత కష్టపడి చదివేదాన్ని. సివిల్స్ కోసం ఢిల్లీకి వెళితే అమ్మ నాతోపాటు వచ్చేది. ఢిల్లీలో చిన్న అద్దెగదిలో అమ్మా..నేనూ.. ఇద్దరమే ఉండేవాళ్లం. ప్రతి పరీక్షకూ అమ్మ నాతోపాటూ సెంటర్‌కు వచ్చేది. ఇంట్లోనే అన్నం కూరలూ చేసి తెచ్చేది. ఉదయం నుంచి సాయంత్రం దాకా అక్కడే కాసుకుని ఉండేది. సివిల్స్‌కి నాలుగుసార్లు ప్రయత్నించి విఫలమయ్యా. ఇక సాధించగలనా? అన్న అనుమానం కలిగి అసంతృప్తి చెందినప్పుడు.. అమ్మ నాకు బాసటగా నిలచింది. వెన్ను తట్టి ప్రోత్సహించేది. చాలా ధైర్యం చెప్పేది. ఆ తర్వాత హైదరబాద్‌కు వచ్చేశాం. అక్కడ ఒక ఫ్లాట్ తీసుకుని ఐదోసారి సివిల్స్‌కు ప్రయత్నించా. అప్పుడు కూడా అమ్మ ఇల్లొదిలి వచ్చి నాతోపాటు ఉండిపోయింది. ఐదో ప్రయత్నంలో ర్యాంకు సాధించా. నా ఐఏఎస్ ప్రయత్నంలో కష్టం అమ్మదే. ఆ విజయంలో సగం అమ్మకే దక్కుతుంది.

ఇప్పుడూ ఆమే!

ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా అమ్మ నాకు ఆసరాగానే ఉంది. విధి నిర్వహణలో ఎక్కువ సమయం బయట ఉండాల్సి ఉంటుంది. ఇప్పుడు కూడా ఇంట్లో ఎక్కువగా అమ్మ ఉంటుంది. మా బాబును ఆమే చూసుకుంటుంది. నాకు స్వేచ్ఛ ఇచ్చింది. విలువలు నేర్పింది. అమ్మ నా మార్గదర్శి కూడా. 62 ఏళ్ల వయస్సులో ఇప్పుడు కూడా ఆమె సలహాలు బాగా ఇస్తారు. ఏదైనా బాధ, సంతోషం కలిగినప్పుడు పెళ్లికి ముందు అమ్మతోనే షేర్ చేసేకునేదాన్ని. పెద్ద రిలీఫ్ అనిపించేది. ఇప్పుడు భర్తతో పంచుకుంటా.

పెళ్లికాక ముందే పుట్టినింటి భారం

అమ్మ పేరు కాశమ్మ. నర్సింగ్ కోర్సు చేశారు. ఇంటి పరిస్థితి అమ్మని పెళ్లి కాక ముందే సౌదీ అరేబియాకు చేర్చింది. అప్పటికి అమ్మ వయసు 19 ఏళ్లట. అక్కడ నర్స్‌గా ఉద్యోగం చేస్తూ అమ్మ నాన్నా అమ్మలకు, తోబుట్టువులకు అండగా నిలిచారు. పెళ్లి తర్వాత కూడా చాలా వరకూ వారి మంచిచెడ్డలు పట్టించుకున్నారు.

చిన్నతనంలో అమ్మను బాగా మిస్సయ్యా!

అమ్మ ఇరవై ఏళ్లు సౌదీ అరేబియాలో ఉద్యోగం చేశారు. పెళ్లయ్యాక, మేము పుట్టాక కూడా అక్కడే కొనసాగారు. ఏడాదికి రెండుసార్లు వచ్చి మమ్మల్ని చూసి వెళ్లేవారు. చిన్నతనంలో అమ్మను బాగా మిస్సయ్యా. నేనే కాదు మా అన్న, అక్కలు అందరికీ ఆ వెలితి ఉండేది. అప్పట్లో అమ్మ మాతో లేకపోవడం వల్ల ఒకటవ తరగతి నుంచే నన్ను హాస్టల్‌లో చేర్చారు. తర్వాత నా చదువంతా అలానే హాస్టల్‌లోనే గడిచింది.

తిరుమలలో 'ఆపరేషన్ గరుడ'



తిరుమల, మే10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ సరిహద్దులో యుద్ధ వాతావరణం నేపథ్యంలో తిరుమలలో ఆక్టోపస్ బలగాలు శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించాయి. సామాన్యులు బస చేసే యాత్రికుల వసతి సముదాయం-3(పీఏసీ)లో 'ఆపరేషన్ గరుడ' పేరుతో గంటన్నర పాటు ఈ ప్రక్రియ చేపట్టాయి. భక్తులు భయాందోళనకు గురికాకుండా ముందస్తుగానే దీనిపై ప్రచారం చేశారు. భక్తులను, సిబ్బందిని బంధీలను ఎలా రక్షించాలి,, ఉగ్రవాదులను ఎలా అంతమొందించాలనే అంశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. నలుగురు ఉగ్రవాదులు తరహాలో ఆయుధాలతో వసతి సముదాయం-3లోకి ప్రవేశించారు. వెంటనే వీఎస్వో తమ ఉన్నతాధికారులతో పాటు ఆక్టోపస్ బేస్‌క్యాంప్‌కు సమాచారమిచ్చారు. వారు ఆయుధాలతో చేరుకున్నారు. మూడు హాళ్లలో నక్కి ఉన్న ఉగ్రవాదులను అంతం చేయడంతో పాటు వారి బంధీలుగా ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్టుగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో అక్టోపస్ తో పాటు విజిలెన్స్, సివిల్ పోలీసు, ఏఆర్, ఏపీఎస్పీ, ఫైర్, బాంబ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు పాల్గొన్నాయని డీఎస్పీ విజయ్‌శేఖర్ మీడియాకు వివరించారు.

విమానాశ్రయంలో ...



రేణిగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులు విమానాశ్రయంపై దాడి చేస్తే ప్రాణనష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, ఎయిర్‌పోర్ట్ భద్రతా దళాల కమాండెంట్ బహదూర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఉగ్రవాదులను ఎదుర్కోవడం, ప్రయాణికులను సురక్షితంగా బయటకు తరలించడం, గాయాల పాలైన వారిని ఆస్పత్రికి తరలించడం, ఉగ్రవాదులను చుట్టుముట్టడం, మట్టుపెట్టడం వంటి విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ ఇన్‌చార్జి పీడీ భూమినాథన్, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మంజునాథరెడ్డి పాల్గొన్నారు.



షార్‌లో..

సూళ్లూరుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా శనివారం షార్‌లోని గేటు 1బి సమీపంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. షార్ కేంద్రాన్ని భద్రత వలయంలోకి తీసుకొన్నారు. సీఐఎస్ఎఫ్ డీఐజీ సంజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసు, మెరైన్ అధికారులతో భద్రతపై చర్చించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజిత్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ ఎన్‌కే గౌర్, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, శ్రీహరికోట ఎస్ఐ శ్రీకాంత్, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మకు వెంకన్న సారె

● తిరువీధులలో ఘనంగా ఊరేగింపు





తిరుమల నుంచి సారె తీసుకొస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, చైర్మన్ బీఆర్ నాయుడు - సారెను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు అందజేస్తున్న దృశ్యం

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి) : గంగ జాతరను పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా ప్రసిద్ధికెక్కిన తాతయ్యగుంట గంగమ్మకు టీటీడీ ఆనవాయితీగా అందజేసే మేల్‌చాట్, పసుపు, కుంకుమ (సారె) శనివారం సాయంత్రం ఆలయానికి చేరుకుంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు సాయంత్రం 4గంటలకు స్థానిక గోవిందరాజ స్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు అందజేశారు. అక్కడి నుంచి కర్నాలవీధి, గాంధీరోడ్డు, బండ్ల వీధి, పెద్దకాపు వీధి మీదుగా అమ్మవారి సారె ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుంది. ఊరేగింపు ముందు కళాకారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకన్నాయి. పలువురు లయబద్ధంగా నాట్యం చేస్తూ ఊరేగింపునకు జాతర కళను తెచ్చిపెట్టారు. ఎమ్మెల్యే కుమారుడు ఆరణి మదన్, అన్న కుమారుడు శివలు నృత్యం చేసి సందడి చేశారు. కాగా, శనివారం భక్తులు దొరవేషంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కైకాల కులస్థులు దొర వేషాన్ని, చాకలి కులస్థులు మంత్రి వేషాన్ని వేశారు.

● నేడు మాతంగి వేషం

గంగజాతర ఉత్సవాలలో భాగంగా ఆదివారం మాతంగి వేషాన్ని భక్తులు ధరిస్తారు. తలకు పసుపుగుడ్డను జడలా కట్టి కొప్పుముడివేసి దానికి మల్లెపూలను చుట్టుకుంటారు. శరీరమంతా గంధం పూసుకుని తెల్ల చీర, లేదా పసుపు చీర కట్టుకుని రవిక తొడుక్కుంటారు. మెడలో పూలహారం వేసుకుంటారు. ఒడిబాల కట్టుకుని అందులో అక్షింతలు, దువ్వెన, భరిణి, రవిక, పసుపు, కుంకుమలు పెట్టుకుంటారు. మాతంగి వెయ్యికళ్ల దేవతని ముఖానికి, ఒళ్లంతా నల్లని ఎర్రని బొట్లు పెట్టుకుంటారు. పలకలు వాయిస్తూ, కొమ్ములు ఊదుతూ ఉంటే మాతంగి వేషగాళ్లు లయబద్ధంగా చిందులు వేస్తూ వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.



● గంగమ్మకు వజ్రపు తిలకం బహూకరణ

తాతయ్యగుంట గంగమ్మకు మంత్ర మహేశ్వరి శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి వజ్రపు తిలకాన్ని బహూకరించారు. శనివారం సారె సమర్పించిన ఆమె రూ2లక్షల విలువైన వజ్రపు తిలకాన్ని ఈవో జయకుమార్‌కు అందజేశారు.

చెరువు భూమిని మింగేస్తున్నారు

● కరకంబాడి చెరువులో 50 ఎకరాల ఆక్రమణ

● ఏకంగా రోడ్డు నిర్మాణం

● ముంపు భూమిని కమర్షియల్‌గా మార్చేస్తున్న వైనం

రేణిగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడీ చెరువు చుట్టూ 50 ఎకరాలు ఆక్రమణకు గురైంది. చెరువులో ఏకంగా రోడ్డు ఏర్పాటు చేసుకుని ముంపు భూమిని కమర్షియల్‌గా మార్చేస్తున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కరకంబాడీ చెరువు 130 ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రస్తుతం



కరకంబాడీ-తిరుపతి ప్రధాన రోడ్డుకు అనుకుని ఉన్న భూముల్లో మట్టిపోసి చదును చేస్తున్నారు. వాస్తవంగా చెరువు ముంపు పట్టా భూముల్లో వ్యవసాయం చేసేవారు. పట్టాలు పొందిన రైతులు వాటిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించినట్లు తెలుస్తోంది. కొనుగోలుదారులు చెరువులోకి నీరు రాకుండా కాసి రాళ్లతో గోడను నిర్మించుకున్నారు. ఇది చాలదన్నట్లు మెయిన్ రోడ్డు నుంచి ఏకంగా రోడ్డును ఏర్పాటు చేసుకుని మట్టితోలి పూడ్చి చెరువును పూడ్చి వేస్తున్నారు. సుమారు 50 ఎకరాలు ఆక్రమణకు గురైందని స్థానిక రైతులు చెబుతున్నారు. దీనిపై శ్రీకాళహస్తి ఇరిగేషన్ డీఈ ప్రకాష్‌రావును వివరణ కోరగా కరకంబాడీ చెరువు ఆక్రమలపై కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో స్థానిక మత్స్యకారులు ఫిర్యాదు చేశారన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని తహసీల్దార్‌ను ఆదేశించామని తెలిపారు. త్వరలోనే ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.



కోట మండల సరిహద్దులో మత్స్యకారులకు సూచనలిస్తున్న మెరైన్ ఎస్‌ఐ శివసౌమ్య, ఏఎస్‌ఐ రాధ

సముద్రతీరంలో నిఘా పెంపు

● 18 తీర ప్రాంత గ్రామాల్లో అప్రమత్తం

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో సముద్రతీర గ్రామాలు అప్రమత్తమయ్యాయి. మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో నిఘా పెంచారు. కోట, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని 18 గ్రామాల్లో కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు మెరైన్ ఎస్‌ఐ శివసౌమ్య తెలిపారు. బయట వ్యక్తుల సంచారం, సముద్రంలోకి అపరిచిత పడవలు, స్టీమర్ల రాకను గుర్తిస్తే వెంటనే 9392914744 నంబర్‌కు, అదేవిధంగా టోల్‌ఫ్రీ నంబర్ 1093కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

భారత ఆర్మీకి చిన్నారుల ఆర్థికసాయం



తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 10(ఆంధ్రజ్యోతి): భారత ఆర్మీకి చిన్నారులు శనివారం ఆర్థికసాయం చేశారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో తమ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించుకోవడం ఇష్టం లేక తిరుపతికి చెందిన అనిరుధ్ శ్రీరామ్, సుచిత్ర శ్రీఅనన్య, ఆశ్రిత్ శ్రీరామ్ అనే ముగ్గురు చిన్నారులు తమ పుట్టిన రోజుకు అయ్యే ఖర్చును భారత ఆర్మీకి ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు తమ తల్లిదండ్రులతో కలిసి శనివారం టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డికి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నగదు అందజేశారు. దానిని భారత ఆర్మీకి పంపేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.


సర్వదర్శనానికి 11 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.45 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 68,213

తలనీలాలు సమర్పించినవారు: 29,635





గంగరంగ వైభవం

అమ్మవారిని దర్శించుకుంటున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఎమ్మెల్యే ఆరణి





తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర శనివారం కోలాహలంగా సాగింది. దొరవేషంలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుమల వెంకన్న సారె ఊరేగింపులో భాగంగా పలువురు భక్తులు వివిధ రకాల వేషాలతో నృత్యాలు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఊరేగింపు భక్తజన ప్రవాహంగా సాగింది.

సారె తీసుకొస్తున్న శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి- బహూకరించిన వజ్రపు తిలకం









సారె ఊరేగింపులో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే కుమారుడు మదన్





నేటి నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మే 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు తరలివెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆది, సోమవారాల్లో ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. సెంట్రల్ బస్టాండులో ఆదివారం ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రతి పది నిమిషాలకూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అమరావతి, ఇంద్రా ఏసీ, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలెక్స్ బస్సులను కేటాయించారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు కోరారు.

టీటీడీ ఉద్యోగులకు హెల్మెట్లు



తిరుమల, మే10(ఆంధ్ర జ్యోతి): టీటీడీ ఉద్యోగులకు శనివారం ఉదయం తిరుమలలోని తన క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడు హెల్మెట్లు పంపిణీ చేశారు. విరాళంగా అందిన రూ.5 లక్షల విలువైన 555 హెల్మెట్లు మొదటి విడతగా ఉద్యోగులకు అందజేశారు. ఉద్యోగులకు హెల్మెట్లు విరాళంగా అందజేసేందుకు గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన కేసీఎన్ హెల్మెట్ల తయారీ సంస్థ అధినేత నవీన్ ముందుకు వచ్చారన్నారు. వీరు మరో ఐదు వేల హెల్మెట్లు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు శాంతారామ్, వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో శ్రీముఖి



శ్రీముఖి



వడ్డేపల్లి రామచందర్

తిరుమల, మే 10 (ఆంధ్రజ్యోతి): సినీ నటి శ్రీముఖి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి మార్గంలో శుక్రవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, గాలి భానుప్రకాష్, ఆదిరెడ్డి శ్రీనివాస్ కూడా శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్వాగతం పలికారు.

పెద్దపరియలో ఆగిపోయిన నెల్లూరు-చెన్నై మెమో

● సాంకేతిక కారణాలతో గంటపాటు నిలిపివేత

ఓజిలి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపరియ రైల్వేస్టేషన్‌లో నెల్లూరు నుంచి చెన్నై వెళుతున్న మెమో రైలు కొంతసేపు నిలిచిపోయింది. సాయంత్రం 5.20గంటలకు పెద్దపరియకు చేరుకున్న రైలు సాంకేతిక కారణాలతో గంటపాటు స్టేషన్‌లోనే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు కొంతమేర ఇబ్బందిపడ్డారు. 6.20గంటలకు పెద్దపరియ నుంచి బయలుదేరి వెళ్లింది.

అమ్మవారి వసంతోత్సవాలకు అంకురార్పణ



ఆకట్టుకుంటున్న వసంతోత్సవ సెట్టింగ్

తిరుచానూరు, మే 10(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి అంకురార్పణతో వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున అమ్మవారికి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. రాత్రి విష్వక్సేనుడిని ఊరేగింపుగా ఫ్రైడేగార్డెన్‌కు తీసుకెళ్లి పుట్టమన్ను సేకరించారు. రక్షాబంధనం, సేనాపతి ఉత్సవం తర్వాత అంకురార్పణ చేశారు. ఆదివారం నుంచి ఫ్రైడేగార్డెన్‌లో మూడు రోజులూ మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారు తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. సోమవారం ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం జరగనుంది. భక్తులు ఒక్కొక్కరు రూ.150చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. అంకురార్పణ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుభాస్కర్; సుబ్బరాయుడు పాల్గొన్నారు.

తిరుమల తరహాలోనే ఇక్కడ కూడా ఆకర్షణీయంగా సెట్టింగ్‌ను రూపొందించారు. ఏటా అమ్మవారి ఉద్యానవనంలో పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం మూడు రోజులపాటు ఈ వేడుకలు జరుపుతారు. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా సెట్టింగ్ ఏర్పాటు చేశారు. వసంతోత్సవాల మండపాన్ని నందనవనంగా అలంకరించారు. వివిధ రకాల జంతువులు, పక్షులు నిజంగానే ఉన్నాయా అనేంతగా టీటీడీ ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది తీర్చిదిద్దారు. వన్యప్రాణుల అరుపులు వినిపించేలా సౌండ్ సిస్టమ్ అమర్చారు. పుష్పాలంకరణను విశేషంగా ఆకట్టుకుంటోంది.





ప్రకృతి రమణీయతతో ఫ్రైడే గార్డెన్‌లో భారీ సెట్టింగ్ - పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

జీతాలు చెల్లించలేదని ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ల సమ్మె

తిరుపతి(ఆర్టీసీ), మే 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుమల మధ్య నడిచే ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లు శనివారం ఉదయం సమ్మెకు దిగారు. ఏప్రిల్ నెల వేతనాలు జమ చేయకపోవడంతో ఆందోళన చేపట్టారు. ఉదయం 6.30గంటలకు డ్యూటీ ఎక్కే 30మంది డ్రైవర్లు విధులను బహిష్కరించారు. జీతాలు చెల్లిస్తేనే బస్సులు నడుపుతామని భీష్మించారు. సమాచారం అందుకున్న అధికారులు విశ్వనాథం, బాలాజీ, హరిబాబు అక్కడికి చేరుకుని డ్రైవర్లతో చర్చించారు. రెండో శనివారం, ఆదివారం సెలవులు కావడంతో రెండు రోజులు ఓపిక పట్టాలని డ్రైవర్లకు నచ్చజెప్పారు. విధులకు వెళ్లాలని కోరారు. అప్పటికే 9.30 గంటలైంది. దాదాపు 3గంటల పాటు ఎలక్ట్రిక్ బస్సులు ఘాట్‌లో రాకపోకలు ఆగిపోయాయి. వారాంతం, సెలవురోజులు కావడంతో విష్ణునివాసంలో ఉదయం బస్సుల కొరత నెలకొంది. 10గంటల నుంచి ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. సకాలంలో జీతాలు జమకాని పక్షంలో సమస్యను తమ దృష్టి తీసుకురావాలని, అలాకాకుండా బస్సులను ఆపేయడం సబబుకాదని డ్రైవర్లకు సూచించారు. అలాగే సకాలంలో జీతాలు చెల్లించాలని నిర్వాహకులకు సూచించారు.



భక్తజన సంద్రం.. ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, మే 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు, వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

మానవత్వాన్ని తట్టిలేపే ఆత్రేయ సాహిత్యం





మాట్లాడుతున్న ఆచార్య విస్తాలి శంకరరావు

శ్రీసిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): మానవత్వాన్ని తట్టిలేపే సాహిత్యం ఆత్రేయ సొంతమని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అన్నారు. శ్రీసిటీలో ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన 'ఆత్రేయ గీతామృతం' కార్యక్రమం ఆకట్టుకుంది. శంకరరావు వక్తగా విచ్చేసి ఆత్రేయ సినీ గీతాల్లో అర్థవంతమైన సాహిత్యం, మాధుర్యాన్ని వివరించారు. సినీ సాహిత్యంలో ఆచార్య ఆత్రేయ ఓ మైలురాయి అని పేర్కొన్నారు. మనసుకు హత్తుకునే గీతాలతో మనసు కవిగా ఆయన పేరుపొందారని తెలిపారు. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు కూడా చెప్పలేని విధంగా మనసు గురించి ఎంతో విశ్లేషణాత్మకంగా తన సాహిత్యం ద్వారా చెప్పారన్నారు. 1951లో వచ్చిన దీక్ష సినిమా ద్వారా తన సినీ గేయ రచనను మొదలు పెట్టి నాలుగు దశాబ్దాల పాటు మనసు, అనుబంధాలు, ప్రేమ, విరహం, స్నేహం, భక్తి తదితర రెండువేలకు పైగా పాటలు రాసిన ఘనత ఆత్రేయదే అన్నారు. కార్యక్రమానికి శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. చెన్నై వేదవిజ్ఞాన వేదిక సంస్థ కార్యదర్శి కందనూరు మధు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

9 మంది అంతర్రాష్ట్ర ఆవుల దొంగలు అరెస్టు

● నాలుగు ఆవులు, వాహనం స్వాధీనం



ఆవుల దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

రేణిగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర ఆవుల దొంగలను అరెస్టు చేసినట్టు గాజులమండ్యం సీఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. గాజులమండ్యం పోలీసు స్టేషన్ పరిధిలోని హైవేపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి రేణిగుంట - పుత్తూరు ప్రధాన రోడ్డు మార్గంలోని ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో పికప్ వ్యాన్‌లో ఆవులను రవాణా చేస్తూ కనిపించడంతో, పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారు బీహార్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ రఫీ, జేకంఖాన్, మహమ్మద్ ఇమ్రాన్, ఇస్రాయిల్, తహీర్, రఫీక్ అహ్మద్, జుబేర్, హనీ హనీస్ అని తేలింది. వారు తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోటకు చెందిన కేబుల్ బాషాతో ముఠాగా ఏర్పడి రేణిగుంట, వడమాలపేట, నాయుడుపేట, గూడూరు ప్రాంతాల్లో ఆవులను దొంగతనం చేసి వాటిని కబేళాలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. నాలుగు ఆవులు, పికప్ వ్యాన్, బైక్ స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సుధాకర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు



స్వామి, అమ్మవార్ల తిరుచ్చి ఉత్సవం

చిల్లకూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పూజలు జరిపారు. సుప్రభాత సేవ, తిరుచ్చి ఉత్సవం విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హనుమంతసేవ భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. శంకయ్య, హైమావతి, పెరికల గోపాలయ్య, సుబ్బమ్మ, సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, జనార్ధనరెడ్డి, రోహిణి దంపతులు ఉభయదాతలుగా మూగ వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామ, బూత్ కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తి చేయండి

గూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామ, బూత్ కమిటీల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గూడూరు మండల టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే బలమని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపునిచ్చేలా కమిటీల్లో నియామకాలు చేపట్టాలన్నారు. సిమెంటు రోడ్లు లేని పంచాయతీలకు సంబంధించి ప్రణాళికలను రూపొందిస్తే ఉపాధి నిధులతో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్‌శాఖ ద్వారా మంజూరైన ఎఫ్‌డీఆర్ పనులను ఆయా సాగునీటి సంఘాల అధ్యక్షుల పర్యవేక్షణలో జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, సురేంద్ర, నరసరాజు, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, పెంచలయ, పిట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సముద్రతీర ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మత్స్యకారులతో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

వాకాడు, మే 10 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లో ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై దుగరాజపట్నంలోని మత్స్యకారులకు డీఎస్పీ గీతాకుమారి శనివారం అవగాహన కల్పించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సౌన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిందన్నారు. ఈ క్రమంలో విద్వేష పూరితమైన సమాచారాన్ని, తప్పుడు వార్తలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం నేరమన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను మత్స్యకారులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా



మహేష్ కుటుంబసభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న కురుగొండ్ల

బాలాయపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి) టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ సభ్యత్వం భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గోళ్ల మహేష్ ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఊట్లపల్లిలో గోళ్ల మహేష్ కుటాంబాన్ని పరామర్శించారు. రూ.ఐదు లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, గోళ్ల మధు, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, సీసీ నాయుడు, కల్యాణ్ రెడ్డి, దాసరి కోటేశ్వరావు, మద్దూరు కృష్ణ, మారెళ్ల వెంకటాద్రి, పులకంటి మురళి, వయ్యావూరు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

వెంకటగిరి, మే10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేటలో ఇటీవల గ్యాస్ సిలిండ్ పేలిన ప్రమాదంలో మృతి చెందిన అనుసూయమ్మ కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. అనుసూయమ్మ టీడీపీ సభ్యతం కలిగి ఉండడంతో రూ.5లక్షల బీమా చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తల్లికి వందనం'

వెంకటగిరి టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కుమ్మరిగుంట, అమ్మవారిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సీడీపీవో షంషాద్‌బేగం ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్పలత, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజారాణి, లక్ష్మీకాంతమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: మండల పరిధిలోని కమ్మపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో షంషాద్ బేగం, ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, ఎంఈవో జగదీష్‌బాబు, ఐసీడీస్ అధికారిణి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న అంగన్‌వాడీ విద్యార్థులు

సముద్ర జలాలతో గ్రామోత్సవం



సముద్ర జలాలున్న గంగపెట్టితో గ్రామోత్సం నిర్వహిస్తున్న వెంకన్నపాళెం గ్రామస్తులు

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం గ్రామదేవత గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శనివారం సముద్ర జలాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గంగపెట్టె, సముద్ర కుంభ జలం, పూలబుట్టలతో పుష్పయాగం కోసం మేళతాళాల మధ్య గ్రామోత్సవం జరిపారు. ఆలయం వద్ద అమ్మవారి ముగ్గు వేసి పండరి భజన, కోలాట బృందం నృత్యాలు చేసింది. అమ్మవారి ఆలయం నుంచి గ్రామ పొలిమేరల వరకు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

తీరప్రాంత గ్రామాల మహిళలకు

గగనంగా మారిన గర్భకోశ వైద్య సేవలు

30 పడకల ఆస్పత్రిలో గైనకాలజిస్టు పోస్టు ఖాళీ

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): సముద్రతీర ప్రాంత గ్రామాల మహిళలకు గర్భకోశ సమస్యలకు వైద్యం గగనంగా మారింది. నాలుగు మండలాల్లోని సర్కారు దవాఖానాల్లో గర్భకోశ వ్యాధి నిపుణులు లేకపోవడంతో మహిళలు దూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. సముద్రతీర ప్రాంత మండలమైన కోట పట్టణంలో 30 పడకల ప్రభుత్వాస్పత్రి ఉంది. చిల్లకూరు మండలంలోని వల్లిపేడు, కోట మండలంలోని చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఈ ఆస్పత్రి పరిధిలోకి వస్తాయి. అలాగే చిట్టమూరు, వాకాడు మండలాల్లోని సముద్రతీర ప్రాంతాల మహిళలు ఎక్కువగా గర్భకోశ వ్యాధుల వైద్యం కోసం కోటలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రికి వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ కొన్ని నెలల పాటు దీర్ఘకాలిక సెలవులో ఉంటూ ఇటీవలే ఉద్యోగానికి రాజీనామా చేశారు. అలాగే ఈ ఆస్పత్రిలో జనరల్ సర్జన్, ఎన్‌సీడీ డాక్టర్లు లేరు. పక్కనే ఉన్న వాకాడు ప్రభుత్వాస్పత్రి గైనకాలజిస్ట్ మెడికల్ లీవ్‌లో ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గర్భిణులు, బాలింతలు గర్భకోశ వ్యాధులకు సంబంధించి అత్యవసర సేవలు పొందాలంటే నాయుడుపేట, గూడూరు పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. మెరుగైన వైద్యం అవసరమైతే నెల్లూరులోని కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిందే. ఆర్థిక స్థోమతలేని వారి పరిస్థితి దయనీయంగా మారింది. కోట మండలంలోని సముద్రతీర ప్రాంత గ్రామాలైన కొత్తపట్నం, శ్రీనివాసనత్రం, గోవిందపల్లి, గోవిందపల్లిపాలెం, సిద్దవరం, వావిళ్ల దొరువు, గున్నంపడియ, యమదిన్నెపాళెం, సిద్దవరం, కర్లపూడి, ఉత్తమనెల్లూరు, దొరువుకట్ట, పుచ్చలపల్లి గ్రామాలకు చెందిన గర్భిణులకు గైనకాలజీ సేవల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి కోటలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజీ సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



కోట ప్రభుత్వాస్పత్రి

అమర జవాన్ మురళీ నాయక్‌కు ఘన నివాళి





గూడూరులో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు - వెంకటగిరిలో సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు

గూడూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్ బలగాలతో పోరాడుతూ కశ్మీర్‌లో వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి జిల్లా గోరంట్ల గ్రామానికి చెందిన మురళీ నాయక్ గురువారం అర్ధరాత్రి 12గంటల సమయంలో కశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్‌లో ఎల్‌వోసీ వద్ద పాక్ సైన్యం జరిపిన కాల్పుల్లో మృతి చెందడం బాధకరమన్నారు. గూడూరు నియోజకవర్గం టీడీపీ తరపున మురళీ నాయక్ కుటుంబానికి రూ.రెండు లక్షలు అందజేస్తామని సునీల్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పిట్టి నాగరాజు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: కశ్మీర్‌లో పాకిస్థాన్ బలగాలతో పోరాడుతూ వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు ఎమ్మెల్యే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, నాయకులు దొంతు శారద, పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, దొంతు బాలకృష్ణ, పునుగోటి విశ్వనాధ నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, శివారెడ్డి, గొల్లగుంట వెంకటముని, మంకు ఆనంద్, తోటా రామచంద్రయ్య, నాగరాజు, చెంగారాజు తదితరులు పాల్గొన్నారు.



సూళ్లూరుపేటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న పట్టణవాసులు

సూళ్లూరుపేట: పాక్‌తో పోరాడుతూ అమరుడైన వీర జవాన్ మురళీ నాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు స్థానికులు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. వీర జవాన్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

'సాగరమాల' పరిహారం కోసం రైతుల ధర్నా



సాగరమాల రోడ్డు వద్ద ధర్నా చేస్తున్న కాపులూరు రైతులు

నాయుడుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయిన తమకు ఇప్పటి వరకు నష్ట పరిహారం అందించలేదంటూ నాయుడుపేట మండలం కాపులూరు గ్రామానికి చెందిన రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. 23 మంది రైతులు పది ఎకరాలకు పైగా భూములు కోల్పోయామని, ఇందుకు సంబంధించి నష్టపరిహారం దాదాపు కోటి రూపాయలు రావాల్సి వుందన్నారు. చాలా మంది రైతులకు పరిహారం ఇచ్చిన అధికారులు తమ పరిహారం అందజేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ధర్నా చేస్తే మే 10వ తేదీలోగా పరిహారం అందేలా చూస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ పరిహారం అందజేయాలని, లేనిపక్షంలో సాగరమాల రోడ్డు పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై తహసీల్దారు రాజేంద్ర మాట్లాడుతూ కాపులూరు రైతులకు అందాల్సిన నష్టపరిహారంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, త్వరలోనే అందజేస్తామని చెప్పారు.

కరిమాణిక్యస్వామి ఉత్సవాలకు అంకురార్పణ

నాయుడుపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయ వార్షికోత్సవాలు శనివారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. గ్రామంలోని పుట్ట మట్టిని తీసుకువచ్చి గ్రామదేవత లేదోటమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కరిమాణిక్యస్వామి ఆలయానికి చేరుకుని వార్షికోత్సవాలకు అంకురార్పణ చేశారు.

సేవాగుణాన్ని పెంపొందించుకోవాలి



వృద్ధాశ్రమంలో నూతన గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని పెంపొందించుకుని, పేదలకు తమవంతు సాయం అందించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే సొంత నిధులతో నిర్మించిన గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఎంతోమంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారన్నారు. వారు ఉండేందుకు ఒక గదిని నిర్మించాలని ప్రగతి సేవాసంస్థ సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో తగిన వసతులో కూడిన గదిని నిర్మించిడం జరిగిందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను గౌరవప్రదంగా చూసుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. అనంతరం వృద్ధాశ్రమానికి ఆడిటర్ శ్రీకంటి రామమోహన్‌రావు దాతృత్వంతో రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. సురేష్‌రెడ్డి దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి, కడివేటి చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

గూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం స్థానిక రైతుబజారు సమీపంలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను, ఉపకార వేతనాలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవికి ప్రత్యేక పూజలు

గూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారికి శనివారం శ్రీచక్ర వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు కోట సునీల్ కుమార్ మాట్లాడుతూ అమ్మవారి శ్రీచక్రాన్ని స్థాపించి 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కలశస్థాపన, మహామృత్యుంజయ అమృత పాశుపత మహారుద్రాభిషేక సహిత హోమపూజలను శాస్త్రోపేతంగా నిర్వహించామన్నారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శత్రుసంహార త్రిశతి హోమ పూజలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



జీవామృతం కలుపుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. 16రకాల విత్తనాలతో ఏటీఎం సాగుపై అవగాహన కల్పించారు. ఫిల్టరైజేషన్ చేసి విత్తనాలు చల్లడం వల్ల కలిగే ఉపయోగాలు, భూమిలో తేమ లేకపోయినా విత్తనం చెడిపోకుండా ఉండి వర్షం పడిన వెంటనే మొలకెత్తే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు పద్మ, శివకుమారి, రైతులు పాల్గొన్నారు.

బస్టాండులో మందుబాబు హల్‌చల్

సూళ్లూరుపేట, మే 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండులో శనివారం రాత్రి ఓ తాగుబోతు హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో బస్టాండు ఆవరణలో రోడ్డుపై అడ్డంగా పడుకోవడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కంట్రోల్ పాయింట్ సిబ్బంది మందుబాబును పక్కకు పంపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

జిల్లా మహాజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజీనామా

నాయుడుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహాజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరరాఘవులు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత సమస్యల కారణంగా తాను పదవి నుంచి తప్పుకుంటున్నానని, రాజీనామా పత్రాన్ని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి పంపినట్లు తెలిపారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు అరుంధతీయవాడలోని మాతమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతమ్మ కొలుపులో భాగంగా శనివారం అమ్మవారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం వద్ద గౌరమ్మ ముగ్గు వేశారు. భక్తులకు గొల్లభామ వినిపించారు. రాత్రి గౌరమ్మ కల్యాణం నిర్వహించారు.

పాముకాటుతో యాచకురాలి మృతి

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి సంగమేశ్వరాలయంలో నిద్రిస్తున్న యాచకురాలిని శనివారం తెల్లవారు జామున పాము కాటు వేయడంతో మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... సుమారు 45 ఏళ్ల మూగ మహిళ గత వారం రోజులుగా కోట, విద్యానగర్‌లో తిరుగుతూ భిక్షాటన చేస్తుండేది. పొద్దు పోయాక సహచర యాచకులతో కలిసి గూడలి సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆరుబయట నిద్రించింది. తెల్లవారు జామున పాము కాటు వేయడంతో కేకలు వేసింది. సహచక యాచకులు లేచి పామును తరిమేశారు. 108 వాహనంలో కోట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా యాచరాలు మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పవన్‌కుమార్ ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. ఆమెకు సంబంధించిన వ్యక్తులు ఎవరూ రాకపోవడంతో గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ పరిధిలో నివాసం ఉంటున్న హరిప్రసాద్(28) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 5వ తేదీ కుటుంబ కలహాలతో హరిప్రసాద్ ఉరివేసుకొని ఆత్మహ్యాకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాయుడుపేట మండలం మేనకూరులోని మేడిన్ సీఎండీ కంపెనీ శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఎలక్ట్రికల్ విభాగం నుంచి ఆరుగురు, మెకానికల్ విభాగం నుంచి ఒక విద్యార్థి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి వార్షిక వేతనం రూ.3.6లక్షలు ఉంటుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషంధర్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం సప్లమెంటరీ పరీక్షల ప్రశ్నపత్రాలు శనివారం కోట పోలీస్‌స్టేషన్‌కు చేరారు. కోటలోని అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రశ్న పత్రాలను అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు.